ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

అనకాపల్లి
జిల్లా వార్తలు
శనివారం 24 మే 2025

ఇసుక మాఫియా

ప్రభుత్వం మారినా.. ఆగని దందా

- ప్రధాన నదుల్లో యథేచ్ఛగా తవ్వకాలు
- యంత్రాలు సైతం వినియోగం
- టిప్పర్లు, లారీల్లో పట్టణాలకు ఇసుక రవాణా
- భారీగా సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు
- తెరవెనుక కూటమి నేతల అండదండలు
- అడ్డుకోవడానికి వెనుకంజ వేస్తున్న అధికారులు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలకు అడ్డూఅదుపు లేకుండా పోతున్నది. పెద్దేరు, బొడ్డేరు, శారదా, సర్పా, వరహా, తాండవ నదుల్లో పలుచోట్ల యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు సాగుతున్నాయి. సొంత అవసరాలకు స్థానికంగా వున్న నదులు, గెడ్డల్లో నుంచి ఇసుకను ఉచితంగా తీసుకెళ్లవచ్చని ప్రభుత్వం కల్పించిన వెసులుబాటును కొంతమంది అక్రమార్కులు తమకు అనుకూలంగా మార్చుకుని దర్జాగా వ్యాపారం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా యంత్రాల్లో ఇసుక తవ్వి, టిప్పర్లు, లారీల్లో ఇతర ప్రాంతాలకు తరలించి భారీగా ఆర్జిస్తున్నారు. అక్రమార్కులకు కూటమి పార్టీలకుచెందిన కొంతమంది నేతలు తెరవెనుక నుంచి అండదండలు అందిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ కారణంగానే ఇసుక అక్రమ తవ్వకందారులపై చర్యలకు అధికారులు వెనుకడుగు వేస్తున్నట్టు తెలిసింది.


మాడుగుల మండలం సాగరం వద్ద పెద్దేరు నదిలో యంత్రాలతో ఇసుక తవ్వకాలు

గత వైసీపీ ప్రభుత్వంలో ఇసుక మాఫియా రెచ్చిపోయింది. నదులు, గెడ్డల్లో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వుకుని అమ్ముకున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఇసుక మాఫియా ఆగడాలకు చెక్ పడుతుందని ప్రజలు భావించారు. కానీ పరిస్థితిలో పెద్దగా మార్పు కనిపించడంలేదు. సొంత అవసరాలకు సమీపంలోని నదులు, గెడ్డల్లో నుంచి అనుమతి మేరకు ఇసుక తీసుకెళ్లవచ్చన్న ప్రభుత్వ వెసులుబాటుకు తూట్లుపొడుస్తున్నారు. రెవెన్యూ, మైనింగ్, పర్యావరణ, జలవనరుల శాఖల నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా యంత్రాలతో రేయింబవళ్లు ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వి, వాహనాల్లో తరలిస్తున్నారు. కొత్త ఇళ్ల నిర్మాణం, పాత ఇళ్లకు మరమ్మతు పనులకు అవసరమైన ఇసుకను నదుల్లో నుంచి తీసుకెళ్లాలంటే ముందుగా గ్రామ సచివాలయాల్లో అనుమతి తీసుకోవాలి. సిబ్బంది జారీ చేసే వే బిల్లు ఆధారంగా నిర్దేత మొత్తంలో ఇసుకను 24 గంటల్లో మనుషులతో తవ్వుకుని ఎడ్ల బండి లేదా ట్రాక్టర్ ద్వారా తీసుకెళ్లాలి. ఇసుక తవ్వకాలకు ఎక్కడా యంత్రాలను వినియోగించకూడదు. కానీ అక్రమార్కులు ఈ నిబంధనలను తుంగలో తొక్కారు. ఎక్కడ ఇసుక వుంటే అక్కడ తవ్వేస్తున్నారు. నదుల గట్లను ఆనుకుని సైతం ... మిగతా 8వ పేజీలో


చోడవరం మండలం శేమునాపల్లి వద్ద శారదా నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు సాగుతున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జనసేన పార్టీ చోడవరం నియోజకవర్గం ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు, నాయకులు

ప్రకృతి వనరుల విధ్వంసం

ఇసుక, గ్రావెల్ అక్రమ తవ్వకాలను అధికారులు ఎందుకు అడ్డుకోవడం లేదు?

- జనసేన 'చోడవరం' ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు ఆగ్రహం

చోడవరం, మే 23 (ఆంధ్రజ్యోతి): చోడవరం మండలంలో విచ్చలవిడిగా సాగుతున్న ఇసుక, గ్రావెల్ అక్రమ తవ్వకాలను అధికారులు తక్షణమే నిలుపుదల చేయించకపోతే తమ పార్టీ శ్రేణులు అడ్డుకోవాల్సి వస్తుందని జనసేన పార్టీ చోడవరం నియోజకవర్గం ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు హెచ్చరించారు. ఆయన జనసేన నాయకులతో కలిసి శుక్రవారం నరసాపురం, శేమునాపల్లి, వెంకన్నపాలెం, గవరవరం, లక్కవరం ప్రాంతాల్లో ఇసుక, గ్రావెల్ అక్రమంగా తవ్వుతున్న ప్రదేశాలను పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఇసుక కోసం శారదా నదిని ధ్వంసం చేస్తున్నారని, కొన్నిచోట్ల నది తీరంలో దాదాపు 20 అడుగుల లోతున ఇసుక తవ్వేస్తున్నారని చెప్పారు. అధికారులు కట్టడి చేసి, అక్రమ తవ్వకందారులపై చర్యలు తీసుకోకపోతే శారదా నదికి, తద్వారా ప్రజలకు ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులు యంత్రాలతో ఇసుకను తవ్వి, తరలించుకుపోతున్నట్టు స్థానికులు చెబుతున్నారని, దీనివల్ల కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని ఆయన అన్నారు. ఉచితం పేరుతో ఇష్టారాజ్యాంగా ఇసుక తవ్వకాలు జరుపుతుంటే రెవెన్యూ, మైనింగ్, పోలీసు శాఖల అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇసుక, గ్రావెల్ అక్రమ తవ్వకందారులను గుర్తించి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఒకవేళ అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయకపోతే జనసేన శ్రేణులు రంగంలోకి దిగాల్సి వస్తుందని పీవీఎస్ఎన్ రాజు స్పష్టం చేశారు. ఆయన వెంట జనసేన నాయకులు అల్లం రామప్పారావు, సిరిపురపు రమేశ్, గూనూరు మూలినాయుడు, సియ్యాద్రి జగదీశ్, ప్రసాద్ తదితరులు వున్నారు.

మళ్లీ కరోనా టెన్షన్!

జిల్లా యంత్రాంగం అప్రమత్తం

అనకాపల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి):



కరోనా మళ్లీ కలకలం రేపుతోంది. 2020 నుంచి 2022 వరకు భారత్‌తో సహా యావత్ ప్రపంచాన్ని కరోనా మహమ్మారి వణికించిన సంగతి తెలిసిందే. తరువాత కరోనా వైరస్ సమసిపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అయితే రెండు, మూడు వారాల నుంచి సింగపూర్, హాంగ్‌కాంగ్ నగరాల్లో మళ్లీ కరోనా లక్షణాలు కనిపించడం, పలు పాజిటివ్ కేసులు నమోదు కావడంతో ప్రజల్లో ఆందోళన మొదలైంది. గురువారం విశాఖపట్నంలో ఒక మహిళకు కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. కరోనా విషయంలో ప్రజలు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారులకు తగు ఆదేశాలు జారీ చేసింది. దీంతో డీఎంహెచ్‌వో డాక్టర్ శాంతిప్రభ.. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీ వైద్యులు, సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఎక్కువ రోజులపాటు దగ్గు, జలుబు, జ్వరంతో బాధపడుతున్న వారికి కరోనా నిర్ధారణ పరీక్షలు చేయాలని సూచించారు. కాగా జనం రద్దీగా వుంటే రైల్వే స్టేషన్, బస్టాండ్, మార్కెట్ ప్రాంతాల్లో కొవిడ్ నిబంధనలు పాటించేలా చర్యలు చేపడుతున్నారు. సామూహిక ప్రార్థనలు, సామాజిక సమావేశాలు, రాజకీయ పార్టీల మీటింగులకు హాజరయ్యే వారు మాస్కులు ధరించాలని సూచిస్తున్నారు. జ్వరం, దగ్గు, జలుబు, గొంతునొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే ఆరుబయట తిరగవద్దని, ఇంటిలోనే విడిగా (హోమ్ ఐసోలేషన్) ఉండాలని సూచిస్తున్నారు.

ఏజెన్సీకి ఆర్టీసీ నైట్‌హాల్ట్ సర్వీసులు నిలుపుదల


నర్సీపట్నం ఆర్టీసీ బస్టాండ్

నర్సీపట్నం, మే 23 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లో వరుసగా జరుగుతున్న ఎదురు కాల్పుల నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు అప్రమత్తమయ్యారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా గురువారం నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలకు రాత్రి హాల్ట్ బస్సు సర్వీసులను ఆపేశారు. రెండు రోజుల క్రితం ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్‌లో జరిగిన ఎదురు కాల్పుల్లో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి, అగ్రనేతల్లో ఒకరైన నంబాల కేశవరావుతో సహా 26 మంది మావోయిస్టులు మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ ఘటన తరువాత ఏవోబీలో మావోయిస్టులు లేదా వారి సానుభూతిపరులు ప్రతీకారదాడులకు దిగి, ఆర్టీసీ బస్సులకు నష్టం కలిగించే చర్యలకు పాల్పడే అవకాశం వుందని అధికారులు భావించారు. దీంతో ముందస్తు జాగత్త చర్యగా నర్సీపట్నం డిపో నుంచి సాయంత్రం ఐదు గంటల తరువాత ఏజెన్సీకి నడిచే బస్సుల సర్వీసులను ఆపేశారు. కృష్ణాదేవిపేట, కొయ్యూరు, రేవళ్లు, చింతపల్లి, సీలేరు, జీకేవీధి, భద్రాచలం, నాతవరం మండలం తాండవ, సరుగుడు తదితర ప్రాంతాలకు నడిచే 21 బస్సు సర్వీసులను రద్దు చేశారు. ఏజెన్సీకి నైట్‌హాల్ట్ బస్సును పూర్తిగా ఆపేశారు. మరో మూడు రోజులు ఇదే పరిస్థితి వుంటుందని అధికారులు అంటున్నారు.

సైబర్ మోసాలకు అడ్డా

అచ్యుతాపురంలో ఏడాది క్రితమే కాల్ సెంటర్లు
అయినా గుర్తించలేని పోలీసు నిఘా వర్గాలు

- తొలుత మూసివేసిన ఒక పాఠశాల భవనాన్ని ఎంచుకున్న ముఠా
- స్థానిక నాయకుడి ద్వారా భవన యాజమానితో చర్చలు
- కాల్ సెంటర్లపై లోతుగా ఆరా తీయడంతో లీజు ప్రయత్నం విరమణ
- అపార్ట్‌మెంట్ల వైపు చూపు
- రెట్టింపు అద్దె ఆఫర్ చేయడంతో వెంటనే ఇచ్చేసిన ఫ్లాట్ల యజమానులు
- అమెరికాలోని అమెజాన్ కస్టమర్లే టార్గెట్‌గా మోసాలు
- ఎట్టకేలకు గుర్తు తెలియని వ్యక్తి సమాచారంతో దాడి చేసి పట్టుకున్న పోలీసులు


సైబర్ నేరగాళ్లు అచ్యుతాపురంలో కాల్ సెంటర్లు నిర్వహించిన అపార్ట్‌మెంట్‌లలో ఇదొకటి

అచ్యుతాపురం, మే 23 (ఆంధ్రజ్యోతి):

అచ్యుతాపురం కేంద్రంగా సైబర్ మోసాలకు పాల్పడుతున్న ముఠా ఏడాది నుంచి కాల్ సెంటర్లు నిర్వహిస్తున్నట్టు స్థానికులు చెబుతున్నారు. ఇంతకాలం పోలీసులు పట్టుకోకపోవడానికి కొంతమంది నేతలు, స్థానిక పోలీసులు అండదండలు వున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అమెరికాలోని అమెజాన్ కస్టమర్లను టార్గెట్ చేసుకుని.. అచ్యుతాపురం కేంద్రంగా సైబర్ మోసాలకు పాల్పడుతున్న మేఘాలయ, సిక్కం తదితర ఈశాన్య రాష్ట్రాలకు చెందిన 33 మందిని పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ ముఠా ఏడాది క్రితమే ఇక్కడ నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్టు తెలిసింది. అచ్యుతాపురం-పూడిమడక రోడ్డులోని ఒక ప్రైవేటు పాఠశాలను కొన్ని కారణాల వల్ల రెండేళ్ల క్రితం మూసివేశారు. ఈ భవనం తమకు అద్దెకు కావాలని 2024 జూలైలో అచ్యుతాపురంలోని ఒక ప్రధాన రాజకీయ పార్టీ నాయకుని ద్వారా పాఠశాల యజమానికి సమాచారం వచ్చింది. పెద్ద మొత్తంలో అద్దె చెల్లిస్తామని చెప్పారు. దీంతో అనుమానం వచ్చిన భవనం యజమాని.. ఎందుకోసం భవనం అద్దెకు తీసుకుంటున్నారని అడిగారు. కాల్ సెంటర్ నిర్వహించడానికి అని సదరు నాయకుడు చెప్పగా.. కాల్ సెంటర్లపై అప్పటికే అవగాహన వున్న సదరు భవనం యజమాని.. ఏ తరహా కాల్ సెంటర్ నిర్వహిస్తారని ప్రశ్నించారు. దీంతో పాఠశాల భవనం అద్దెకు తీసుకునే ... మిగతా 8వ పేజీలో

రైతు బజార్‌కు మోక్షం లేదా?

ఎలమంచిలిలో పుష్కరకాలం క్రితం నిర్మాణం

- ప్రారంభించిన కొద్ది రోజులకే మూత
- అప్పటి నుంచి పట్టించుకోని పాలకులు, అధికారులు
- నష్టపోతున్న కూరగాయ రైతులు, వినియోగదారులు


పుష్కరకాలం నుంచి నిరుపయోగంగా పడి వున్న రైతు బజార్

ఎలమంచిలి, మే 23 (ఆంధ్రజ్యోతి):

పట్టణంలో పుష్కరకాలం క్రితం నిర్మించిన రైతుబజార్ నిరుపయోగంగా పడివుంది. ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ దీనిని వినియోగంలోకి తీసుకురావడానికి ఎవరూ ప్రయత్నించడం లేదని రైతులు, వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎలమంచిలి, ఎస్.రాయవరం మండలాల్లోని పలు గ్రామాల రైతులు తాము పండించిన కూరగాయలు, ఆకు కూరలను ఎలమంచిలి తీసుకువచ్చి అమ్ముతుంటారు. పట్టణంలోని రిటైల్ కూరగాయల వ్యాపారులతోపాటు సాధారణ వినియోగదారులు కూడా వీరి నుంచి కొనుగోలు చేస్తుంటారు. అయితే ఇక్కడ మార్కెట్‌లో దళారుల దందా అధికంగా వుంది. ఈ కారణంగా రైతులకు తక్కువ ధర లభిస్తున్నది. మరోవైపు వినియోగదారులు ఎక్కువ రేటుకు కూరగాయలు కొనుగోలు చేసుకోవాల్సి వస్తున్నది. అప్పటికే విశాఖ నగరంలో ఏర్పాటు చేసిన రైతు బజార్‌లు విజయవంతంగా నడుస్తూ అటు రైతులకు, ఇటు వినియోగదారులకు ఎంతో దోహదపడుతున్నాయి. దీంతో ఎలమంచిలిలో కూడా రైతు బజార్ ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేశారు. దీంతో పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం చెంతనే 2011వ సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం రైతు బజార్ నిర్మించింది. ఈ సమయంలో ఎమ్మెల్యేగా వున్న యూవీ రమణమూర్తిరాజు ప్రారంభించారు. రైతులు కూరగాయలను ఇక్కడకు తీసుకువచ్చి విక్రయించడం మొదలుపెట్టారు. అయితే స్థానికంగా కూరగాయల వ్యాపారంచేసే దళారుల దందా పెరిగిపోవడంతో రైతులు తట్టుకోలేక గతంలో మాదిరిగా రోడ్డు పక్కన అమ్ముకోవడం ప్రారంభించారు. దీంతో రైతు బజార్ నిరుపయోగంగా మారి తుప్పలు పెరిగిపోయాయి. రేకుల షెడ్లు పాడైపోయాయి. తరువాత పంచకర్ల రమేశ్‌బాబు, మళ్లీ రమణమూర్తిరాజు ఎమ్మెల్యేలుగా పనిచేశారు. కానీ రైతు బజార్‌కు మోక్షం కలగలేదు. ఇప్పుడు సుందరపు విజయకుమార్ ఎమ్మెల్యేగా వున్నారు. ఇప్పటికైనా రైతు బజార్‌ను వినియోగంలోకి తేవాలని అటు రైతులు, ఇటు వినియోగదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పెట్రోల్ బంకు పనులు బంద్

డీసీఎంఎస్ స్థలంలో గత ప్రభుత్వ హయాంలో మంజూరు

- కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత నిర్మాణం మొదలు
- చుట్టూ ఇళ్లు, హోటళ్లు, క్రీడామైదానం, కళాక్షేత్రం
- పెట్రోల్ బంకు వద్దని ఎంపీని కోరిన టీడీపీ నేతలు
- అర్ధంతరంగా పనుల నిలుపుదల


నిలిచిపోయిన పెట్రోల్ బంకు నిర్మాణ పనులు

అనకాపల్లి టౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) ప్రధాన కార్యాలయం స్థలంలో చేపట్టిన హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంకు పనులు నిలిచిపోయాయి. చుట్టూ నివాస గృహాలు, హోటళ్లు, క్రీడా మైదానం, రావు గోపాలరావు కళాక్షేత్రం వంటివి వుండడం, పలువురు స్థానికులు అభ్యంతరం చెప్పడంతో పెట్రోల్ బంకు విషయంలో ముందుకు వెళ్లకూడదని ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో పెట్రోల్ బంకు ఏర్పాటు చేయాలని అప్పటి పాలకవర్గం భావించింది. హెచ్‌పీసీఎల్‌కు ప్రతిపాదనలు పంపారు. సంస్థ ... మిగతా 8వ పేజీలో

సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష రేపు

విశాఖలో 19 కేంద్రాలు, 8,424 మంది అభ్యర్థులు

- కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్
- అభ్యర్థులు అరగంట ముందుగా కేంద్రాలకు చేరుకోవాలి
- ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకువెళ్లకూడదు
- కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్


మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, మే 23 (ఆంధ్రజ్యోతి): ఈనెల 25వ తేదీన సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ ఆదేశించారు. మొత్తం 19 కేంద్రాల్లో 8,424 మంది పరీక్షకు హాజరవుతారన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల్లో జామర్లు ఏర్పాటుచేయాలని బెల్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. పరీక్షల నిర్వహణలో ఎటువంటి లోటుపాట్లు తలెత్తకుండా ముందుజాగ్రత్త చర్యగా కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్ (0891-2590100, 0891-2590102) ఏర్పాటు చేశామన్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి సందేహాలుంటే కంట్రోల్‌రూమ్‌కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవాలని సూచించారు. పరీక్ష అరగంట ముందుగా కేంద్రాలకు చేరుకోవాలని, ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకు రాకూడదని కలెక్టర్ స్పష్టంచేశారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఐడీ కార్డు తీసుకురావాలని, ఒకవేళ కార్డు తీసుకురాకపోతే సెల్ఫ్ డిక్లరేషన్ ఫారం సమర్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డీఆర్వో బీహెచ్ భవానీశంకర్, యూపీఎస్సీ డైరెక్టర్ పట్నాయక్, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి 200 మంది జనసేనలో చేరిక

▸▸ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే 'సుందరపు'



పార్టీలో చేరినవారిని ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయకుమార్

రాంబిల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కృష్ణంపాలెం పంచాయతీ సర్పంచ్ పి.సత్తిబాబు, మరో రెండు వందల మంది వైసీపీ నుంచి శుక్రవారం జనసేనలో చేరారు. వెంకటాపురంలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ వీరికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో వైసీపీకి ప్రజలు బుద్ధి చెప్పినా ఆ పార్టీ నేత జగన్‌మోహన్‌రెడ్డి, నాయకుల తీరు నేటికీ మారలేదన్నారు. జగన్ విధానాలతో ఆపార్టీ ఖాళీ అవుతోందన్నారు. ప్రజారంజక పాలన అందిస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ప్రజలంతా ఆశీర్వదిస్తున్నారని వివరించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సేవలను గుర్తించి గ్రామాల్లోని వైసీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో జనసేనలో చేరుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన రాంబిల్లి, అచ్యుతాపురం మండల శాఖల అధ్యక్షులు పప్పల నూకన్నదొర, బి.శ్రీరామదాసు, రాజుకోడూరు సర్పంచ్ ఎం.శంకరావు, సంతపాలెం నాయకులు కె.చినబాబు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ అప్పలనరసింహం సేవలు ఆదర్శనీయం



అప్పలనరసింహం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సురేంద్ర తదితరులు

మునగపాక, మే 23 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎంపీ దివంగత పెతకంశెట్టి అప్పల నరసింహం సేవలు ఆదర్శనీయమని గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర అన్నారు. నాగులాపల్లి గ్రామంలో శుక్రవారం అప్పలనరసింహం వర్ధంతిని నిర్వహించారు. ఈ సం దర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం మాట్లా డారు. గ్రామాల్లో రక్షిత నీటి పథకాలు, బ్రిడ్జిలు తదితరాల నిర్మాణానికి ఆయన ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యల్లపు వెంకట భాస్కరరావు, బొడ్డేడ శ్రీను, పి.నూకాలయ్య, రాజునాయుడు, మళ్ల కాశీశ్వరరావు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

25న మునగపాకలో సత్తమ్మతల్లి పండుగ

మునగపాక, మే 23 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం మునగపాకలో ఈ నెల 25వ తేదీన సత్తమ్మతల్లి పండుగ జరగనుంది. ఇందుకు సంబంధించి నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపడుతున్నారు. ఆ రోజు వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభం కానున్నాయన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాల్సిందిగా కోరారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు.. యానాద్రి కాలువ అభివృద్ధి

▸▸ దశాబ్దాల తరబడి పట్టించుకున్నవారు కరువు ▸▸ డ్రైనేజీ సమస్యతో ఎలమంచిలి వాసులకు అవస్థలు ▸▸ ప్రభుత్వ చొరవతో చకచకా పనులు

ఎలమంచిలి, మే 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని యానాద్రి కాలువ ఆధునికీకరణ పనులు జోరుగా సాగుతున్నాయి. దశాబ్దాలుగా పాలకుల నిర్లక్ష్యానికి ఈ కాలువ గురైంది. ఎలమంచిలిలో సుమారు రెండున్నర కిలో మీటర్లు మేర విస్తరించి ఉన్న ఈ కాలువను పట్టించుకునేవారు లేకపోవడంతో ప్రజలు డ్రైనేజీ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఎలమంచిలి పంచాయతీ స్థాయి నుంచి మునిసిపాలిటీగా అప్‌గ్రేడ్ జరిగి పదమూడేళ్లు కావస్తున్నా అభివృద్ధి చేసేవారు కరువయ్యారు. కూటమి అధికారంలో వచ్చాక ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ఈ కాలువ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇందు కోసం విశాఖ మెట్రో పాలిటిన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్‌డీఏ) సుమారు రూ.2.73 కోట్ల నిధులు మంజూరు చేయంతో ఎమ్మెల్యే ఈ పనులకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం పనులు శరవేగంగా జరగుతున్నాయి. ముందుగా కాలువలో పూడిక తొలగింపు చేపట్టారు. పనులు జోరందుకున్న సమయంలో ఇటీవల కురిసిన వర్షాలు కాస్త ఆటంకంగా మారాయి. కాలువలో వర్షపు నీరు భారీగా చేరడంతో పనులకు ఇబ్బందులు లేకుండా ఆ నీటిని మోటార్ల సహాయంతో తోడిస్తున్నారు. కాలువ పనులు జరుగుతుండడంతో పట్టణవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



జోరుగా సాగుతున్న యానాద్రి కాలువ అభివృద్ధి పనులు

వైభవంగా వెంకన్న కల్యాణం



స్వామివారి కల్యాణాన్ని జరుపుతున్న అర్చకులు

మునగపాక, మే 23 (ఆంధ్రజ్యోతి) : నాగులాపల్లిలోని పాటిమీద గల వేంకటేశ్వర ఆలయంలో శుక్రవారం స్వామివారి కల్యాణాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు వేకువజామున విశేష పూజలు జరిపారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణాన్ని జరిపించారు. ఈ వేడుకల్లో భాగంగా ఉయ్యాల సేవ, మహిళల కోలాటం వంటి అందరినీ ఆకట్టుకున్నాయి. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ దాడి ప్రకాశ్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

'రూ.25 లక్షలతో కృష్ణంరాజు సాగునీటి కాలువ అభివృద్ధి'



రైతులనుద్దేశించి మాట్లాడుతున్న ఏషియన్ పెయింట్ పీఈ అనిల్‌కుమార్

మునగపాక, మే 23 (ఆంధ్రజ్యోతి) : సామాజిక బాధ్యతగా సాగునీటి కాలువల అభివృద్ధి చేపట్టనున్నామని ఏషియన్ పెయింట్స్ సంస్థ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ అనిల్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఇక్కడి రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునగపాకలో గల కృష్ణంరాజు సాగునీటి కాలువను సుమారు రూ.25 లక్షలతో అభివృద్ధి చేయనున్నామన్నారు. ఇందులో భాగంగా 16 గేట్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. అనకాపల్లి ఆవ కాలువలో పూడికతీత పనులు జరుగుతున్నాయని సాగునీటి సంఘం చైర్మన్ ఆడారి ఆనంద్ సన్యాసినాయుడు తెలిపారు. కృష్ణంరాజు కాలువలో మునగపాక నుంచి వాడ్రాపల్లి ఆవ వరకు తుప్పల తొలగింపు కార్యక్రమం ఈనెల 25న ప్రారంభిస్తామని ఆ సంఘం చైర్మన్ పెంటకోట రాము తెలిపారు. ఈ సమావేశంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, జనసేన మండల అధ్యక్షుడు టెక్కలి పరశురాం, దొడ్డి లీలా మహేష్, ములబందగోడి రైతు సంఘం అధ్యక్షుడు దాడి శివ, దాడి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాల సేకరణ కేంద్ర భవనాలు ప్రారంభం

అచ్యుతాపురం రూరల్/రాంబిల్లి, మే 23 : మండలంలోని గొర్లెధర్మవరం, జంగాలపాలెం గ్రామాల్లో రూ.21 లక్షలతో ఏర్పాటు చేసిన పాల సేకరణ కేంద్రాల భవనాలను శుక్రవా రం ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, ఎలమంచిలి మునిసిపల్ చైర్‌పర్సన్ రమా కుమారి ప్రాంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాడి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు సంస్థ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పాడి రైతులకు దాణా గిన్నెలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అచ్యుతాపురం జనసేన మండల శాఖ అధ్యక్షుడు బి.శ్రీరామదాసు, ద్వారపురెడ్డి బాబ్జి, కూటమి నాయకులు పాల్గొన్నారు. అలాగే, రాంబిల్లి మండలం రాజుకోడూరులో ఏర్పాటు చేసిన నూతన పాలసేకరణ కేంద్రం భవనాన్ని ఎమ్మెల్యే, మున్సిపాలిటీ చైర్‌పర్సన్ ప్రారంభించారు. జనసేన రాంబిల్లి మండల శాఖ అధ్యక్షుడు పప్పల నూకన్నదొర, సర్పంచ్ ఎం.శంకర్రావు, పలువురు గ్రామ పెద్దలు, డెయిరీ సిబ్బంది పాల్గొన్నారు.



రాజుకోడూరులో పాలసేకరణ కేంద్ర భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, చైర్‌పర్సన్

ఎస్‌ఐ ప్రసాదరావుకు ఉన్నతాధికారుల ప్రశంసలు



ఎస్పీ తుహిన్ సిన్హా నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న ఎస్‌ఐ ప్రసాదరావు

మునగపాక, మే 23 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ చూపినందుకు స్థానిక ఎస్‌ఐ పి.ప్రసాదరావు శుక్రవారం ఉన్నతాధికారులతో ప్రశంసలు అందుకున్నారు. అనకాపల్లిలో జరిగిన సమావేశంలో ఈ మేరకు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆయనకు ప్రశంసా పత్రం అందజేయడంతో పాటు అభినందించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ సిబ్బంది సహకారంతో ఇదే స్ఫూర్తిలో పనిచేస్తానన్నారు.

తిమ్మరాజుపేటలో చెరువు ఆక్రమణ ఫిర్యాదుపై విచారణ



ఇరువర్గాల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్న డీటీ శేషుబాబు

మునగపాక, మే 23 (ఆంధ్రజ్యోతి) : తిమ్మరాజుపేటలో చెరువు ఆక్రమణకు గురైందన్న ఫిర్యాదుపై శుక్రవారం క్షేత్రస్థాయి పరిశీలన జరిపి విచారణ చేపట్టినట్టు డిప్యూటీ తహసీల్దార్ శేషుబాబు తెలిపారు. ఇందులో భాగంగా ఇరువర్గాల అభిప్రాయాలను నమోదు చేసుకున్నామన్నారు. నివేదికను ఉన్న తాధికారుల దృష్టికి తీసుకు వెళ్లడం జరుగుతుందన్నారు.

సేంద్రియ సాగు ఎంతో మేలు

మునగపాక, మే 23 (ఆంధ్రజ్యోతి) : ప్రతి రైతు సేంద్రియ సాగుకు మొగ్గు చూపాలని గణపర్తి సర్పంచ్ చదరం గణేష్ నాయుడు సూచించారు. శుక్రవారం ఇక్కడి సచివాలయంలో జరిగిన రైతుల సమావేశంలో మాట్లాడారు. వరి పంటలో సేంద్రియ సాగు చేస్తున్న కర్రి కన్నారావు, మారిశెట్టి మల్లిపువ్వులు, కర్రి మల్లేశ్వరరావు, ఆడారి దారబాబు, దారనాయుడులను సత్కరించారు.

రేషన్ వాహనాల రద్దుతో డీలర్ల సంబరాలు



టీడీపీ మండల అధ్యక్షుడు అబద్ధంకు స్వీట్ తినిపిస్తున్న రేషన్ డీలర్లు

ఎస్.రాయవరం, మే 23 (ఆంధ్రజ్యోతి): వాహనాలపై రేషన్ సరఫరా విధానాన్ని ప్రభుత్వం రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయంపై రేషన్ డీలర్లు సంబరాలు చేసుకున్నారు. ఈ మేరకు మండల కేంద్రం ఎస్.రాయవరంలో శుక్రవారం డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు అప్పారావు ఆధ్వర్యంలో టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధంకు డీలర్లంత మిఠాయిలు తినిపించి సంబరాలు జరుపుకున్నారు. తరువాత ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు నాదేండ్ల మనోహర్, వంగలపూడి అనిత, ఎంపీ సీఎం రమేశ్ చిత్ర పటాలకు నాయకులతో కలిసి డీలర్లంతా పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు అబద్ధం మాట్లాడుతూ వాహనాలపై రేషన్ సరఫరా చేసే విధానాన్ని ప్రభుత్వం రద్దు చేసి, మరలా పాత పద్ధతిలో రేషన్ డీలర్ల ద్వారా ప్రజలకు రేషన్ అందించేలా నిర్ణయం తీసుకోవడంపై డీలర్లంతా ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాష్ట్ర అభివృద్ధితో పాటు అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే ప్రధాన ధ్యేయంగా పాలన కొనసాగిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు తుమ్మపాల నాగేశ్వరరావు, డీలర్ల సంఘం నాయకులు పాల్గొన్నారు.

అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ బి.సూరి రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి రేషన్ దుకాణాల ద్వారా సరఫరా చేయాలని చెప్పారు. ఈ విధానం గురించి డీలర్లకు ఆయన వివరించారు.

ఎరువుల వినియోగం తగ్గించుకోండి

▸▸ మండల వ్యవసాయాధికారి ఉమాప్రసాద్



రైతులకు రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏవో

నక్కపల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): రైతులు ఎరువుల వినియోగాన్ని తగ్గించుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.ఉమాప్రసాద్ సూచించారు. శుక్రవారం నక్కపల్లి రైతు సేవా కేంద్రం వద్ద రైతులకు 50శాతం సబ్సిడీపై పచ్చి రొట్ట విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతులకు ఆయన పలు సూచనలు చేశారు. నేలకు తగినంత సేంద్రియ పదార్థాన్ని అందించేందుకు పచ్చి రొట్ట వాడకం సులభమైన పద్ధతి అన్నారు. జనుము, పిల్లి పెసర, జీలుగ వేసుకోవాలని సూచించారు. పూతకు వచ్చే సమయంలో నేలలో కలియదున్ని ఎరువుగా ఉపయోగించుకోవాలన్నారు. పచ్చిరొట్ట ఎరువు భూమిలో పోషకాలను అందుబాటులోకి తీసుకువచ్చి, భూ సారాన్ని కాపాడుతుందన్నారు. ఎరువులను తగ్గిస్తే రైతులకు పెట్టుబడి కూడా తగ్గుతుందని ఆయన చెప్పారు.

నక్కపల్లిలో కదం తొక్కిన దళిత సంఘాలు

▸▸ డొంకాడలో దళితులపై ఇతర కులాల దాడికి నిరసన



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న దళిత సంఘాల ప్రతినిధులు

నక్కపల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డొంకాడ గ్రామంలో దళితులపై అగ్రవర్ణాల వారు దాడి చేసి రెండు వారాలు గడుస్తున్నా ఇంతవరకూ నిందితులను అరెస్టు చేయలేదంటూ శుక్రవారం దళిత సంఘాల ఆధ్వర్యంలో నక్కపల్లిలో భారీ ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు నేతృత్వంలో నాసా సంస్థ, వామపక్షాలు, పలు ప్రాంతాలకు చెందిన దళిత సంఘాల ఆధ్వర్యంలో నక్కపల్లి సహకార సొసైటీ నుంచి పోలీస్ స్టేషన్ వరకూ నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం పోలీస్ స్టేషన్ బయట దళిత సంఘాల ప్రతినిధులు ఆందోళన కార్యక్రమం చేపట్టారు. అనంతరం అక్కడి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ నరసింహమూర్తికి వినతిపత్రం అందజేశారు. దళితులను కులం పేరుతో దూషించి, దాడి చేసిన వారిని అరెస్టు చేయకుండా పోలీసులు కొమ్ముకాస్తున్నారని దళిత సంఘాల ప్రతినిధులు ఆరోపించారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తానని నరసింహమూర్తి చెప్పారు. దళితులపై దాడులు చేసిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల ప్రతినిధులు బి.కల్యాణరావు, ప్రభాకరరావు, సోనీవుడ్, జి.కోటేశ్వరరావు, ఎం.అప్పలరాజు, రాము నాయుడు, సుబ్బన్న, చిరంజీవి, శ్రీను, ఏసు, చిన్న రాజేశ్, కన్నబాబు, అప్పారావు, శివ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో బహుళ ప్రయోజనాలు

ఎంపీడీవో సీతారామరాజు, తహసీల్దార్ నరసింహమూర్తి

నక్కపల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): యోగా చేయడంలో పిల్లల నుంచి పెద్దల వరకూ బహళ ప్రయోజనాలు కలుగుతాయని నక్కపల్లి ఎంపీడీవో డి.సీతారామరాజు, తహసీల్దార్ నరసింహమూర్తి చెప్పారు. జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా డేను పురస్కరించుకుని యోగా మాసోత్సవాలపై శుక్రవారం నక్కపల్లిలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సదస్సులో ఎంపీడీవో, తహసీల్దార్ మాట్లాడుతూ యోగా చేయడం వల్ల ఒత్తిడిని అధిగమించవచ్చునన్నారు. ఒత్తిడి లేనప్పుడు ప్రశాంతత లభిస్తుందని ఆయన చెప్పారు. రోజూ క్రమం తప్పకుండా యోగాసనాలు చేయడం వల్ల ఆరోగ్యం బాగుంటుందని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు విశాఖ కేంద్రంగా జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు అందరూ అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. యోగా ప్రోటోకాల్ ప్రకారం గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో గ్రామీణ ప్రాంతాల నుంచి విద్యార్థులు పాల్గొనేలా చూడాలన్నారు. ఇందుకు సంబంధించి మండలంలో విస్తృతంగా పలు యోగా శిక్షణా కార్యక్రమాలు, అవగాహనా సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. గ్రామ, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులంతా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వేంపాడు ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ కె.రఘు, గొడిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రావణి సంధ్య, ఈవోఆర్‌డీ శ్రీనివాసరావు, ఏపీవో భాగ్యవతి, యోగా శిక్షకులు డి.రాంబాబు, డీఎన్‌వీ సాయి, నరసమ్మ, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



నక్కపల్లిలో అవగాహన ర్యాలీ చేస్తున్న ఉద్యోగులు, వైద్యులు, సిబ్బంది

టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టికి సత్కారం



పాయకరావుపేట, మే 23 (ఆంధ్రజ్యోతి) టీడీపీ పాయకరావుపేట నియోజకవర్గ కన్వీనర్‌గా నియమితులైన కొప్పిశెట్టి వెంకటేశ్‌కు టీడీపీ నాయకులు అభినందనలు తెలిపారు. శుక్రవారం నక్కపల్లిలోని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత క్యాంపు కార్యాలయంలో వెంకటేశ్‌ను కలిసిన టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, మండల అధ్యక్షుడు చించెలపు ప్రదీప్, ప్రధాన కార్యదర్శి బొంది కాశీవిశ్వనాథం, శ్రీరాంపురం పీహెచ్‌సీ మాజీ చైర్మన్ దేవవరపు రాజబాబు తదితరులు ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చింతకాయల రాంబాబు, జూరెడ్డి ప్రసాద్, వేములపూడి అప్పారావు, అనిశెట్టి శ్రీను, దువ్వి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కొప్పిశెట్టి వెంకటేశ్‌కు అభినందనలు తెలుపుతున్న పెదిరెడ్డి చిట్టిబాబు తదితరులు

నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలిగా రమాకుమారి



రమాకుమారి

పాయకరావుపేట, మే 23 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలిగా మల్లపురెడ్డి రమాకుమారి రెండోసారి నియమితులయ్యారు. పాయకరావుపేటకు చెందిన రమాకుమారి టీడీపీలో మహిళా నాయకురాలిగా సేవలు అందిస్తూనే గతంలో మండల తెలుగు మహిళా అధ్యక్షురాలిగా రెండు దఫాలు, నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలిగా ఒకసారి పనిచేశారు. పాయకరావుపేట ఆరో సెగ్మెంట్ టీడీపీ ఎంపీటీసీ సభ్యురాలిగా సేవలందిస్తూనే పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. పార్టీ అభివృద్ధికి ఆమె చేస్తున్న కృషిని గుర్తించిన రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలిగా రెండోసారి అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా రమాకుమారి మాట్లాడుతూ రానున్న రోజుల్లో నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో నూతన కమిటీలు వేసి పార్టీ మరింత బలోపేతం అయ్యేందుకు కృషి చేస్తానని తెలిపారు. కాగా రమాకుమారి నియామకంపై నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

యోగాంధ్రపై సమన్వయ సమావేశం

ఎస్.రాయవరం, మే 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం యోగాంధ్ర కార్యక్రమానికి సంబంధించి చర్చించాల్సిన విషయాలపై మండల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించినట్టు ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమావేశంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ఎక్కువ మంది జనాలు పాల్గొనేలా ప్రోత్సాహించడం. జూన్ నెల 15న కొత్త రేవుపోలవరం సముద్ర తీరం వద్ద టూరిజం డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో వెయ్యి మందితో యోగా శిక్షణా కార్యక్రమం నిర్వహించడంపై ప్రధానంగా చర్చించామన్నారు. అలాగే ఈ నెల 26వ తేదీ నుంచి గ్రామ స్థాయిలో శిక్షణా పోటీలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జె.రమేశ్ బాబు, ప్రభుత్వ ఆయూష్ వైద్యాధికారి సుజాత, మండల ఇంజనీర్లు దుర్గాశంకర్, యోగేంద్ర, ఏపీఎం శివప్రసాద్, ఏపీవో ఎరకయ్య పాల్గొన్నారు.



మండల పరిషత్ కార్యాలయంలో సమావేశమైన అధికారులు



వినికిడి యంత్రానికి రూ.5.55 లక్షల మంజూరు పత్రం అందిస్తున్న స్పీకర్

రూ.7.62 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నర్సీపట్నం, మే 23 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ఆరుగురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.7,62,345 మంజూరయ్యాయి. శుక్రవారం స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేతుల మీదుగా వారందరికీ మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీవ్ర అనారోగ్యంతో వైద్య ఖర్చుల కోసం డబ్బులు లేక ఇబ్బంది పడుతున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం ఒక భరోసాను ఇస్తున్నదని చెప్పారు.

చీడిగుమ్మల విద్యార్థికి రూ.5.55 లక్షలు

గొలుగొండ: చీడిగుమ్మల గ్రామానికి చెందిన విద్యార్థి ఎం.మణికంఠకు వినికిడి యంత్రం కోసం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.5.55 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ చెక్కును నర్సీపట్నం స్పీకర్ క్యాంపు కార్యాలయలంలో శుక్రవారం స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మణికంఠ తల్లి రమ్యకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నేత కామిరెడ్డి గోవింద్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి పెట్టండి

▸▸ జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి



నారాయణరాజుపేట గ్రామంలో సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో

మాకవరపాలెం, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టిసారించాలని జిల్లా పంచాయతీ అధికారిణి శిరీషారాణి ఆదేశించారు. మండలంలోని నారాయణరాజుపేట, బయ్యవరం, గిడుతూరు గ్రామాల్లో సంపద కేంద్రాలను శుక్రవారం సందర్శించారు. తడి, పొడి చెత్త సేకరణ, కంపోస్టు ఎరువు తయారీ తదితర అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం, విద్యుత్, తాగునీటి పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుందన్న అంటు వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు చేపట్టాలని, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అలాగే కొండలఅగ్రహారం గ్రామం రోడ్డుకు ఆనుకొని ఉన్న చెత్త కుప్పలను తొలగించాలని సిబ్బందికి సూచించారు. రోడ్డుపై చెత్తకుప్పలు ఉంటే పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తప్పవని డీపీవో హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఎల్పీవో మూర్తి, ఎంపీడీవో ఛాయిసుధా, ఈవోపీఆర్డీ సీతామహాలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మునగాకు సాగుతో సిరుల పంట



డ్వాక్రా మహిళలతో మాట్లాడుతున్న అధికారులు

బుచ్చెయ్యపేట, మే 23 (ఆంధ్రజ్యోతి): మునగాకు సాగు రైతులకు సిరులు పంట కురిపిస్తున్నదని వెలుగు డీపీఎం ప్రసాద్ చెప్పారు. బుచ్చెయ్యపేట వెలుగు కార్యాలయంలో శుక్రవారం మునగాకు సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. జిల్లాలోని బుచ్చెయ్యపేట, గొలుగొండ మండలాలను మునగాకు సాగు కోసం పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్టు చెప్పారు. మండలంలో వంద ఎకరాల్లో మునగాకు సాగు లక్ష్యంగా నిర్ణయించామన్నారు. తమిళనాడు నుంచి విత్తనాలు తీసుకు వస్తామన్నారు. మునగాకు సాగుతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని ఆయన తెలిపారు. ఒక ఎకరాకు ఐదు లక్షల నుంచి ఏడు లక్షల రూపాయల వరకూ ఆదాయం పొందవచ్చునన్నారు. రైతులు ఉత్పత్తి చేసిన మునగాకును పొడిగా మార్చి మార్కెటింగ్ చేసేందుకు యంత్రాలు కూడా ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు. మొదటి దశగా కనీసం 50 ఎకరాల్లో సాగు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎంలు రాజుబాబు, జగన్, రైతుమిత్ర సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

వీడని నీటి సరఫరా పైపుల లీకేజీ సమస్య

▸▸ మెయిన్ రోడ్డు ధ్వంసం.. వాహన చోదకులకు నరకం



పైపుల మరమ్మతు తర్వాత మెయిన్ రోడ్డుపై పెట్టిన చెట్టు కొమ్మ

నర్సీపట్నం, మే 21 (ఆంధ్రజ్యోతి): మెయిన్ రోడ్డు అడుగున ఉన్న ప్రధాన నీటి సరఫరా పైపు నుంచి తరచూ నీరు లీకేజీ అవుతోంది. పైపులు మరమ్మతులు చేయడానికి రోడ్డు తవ్వకడం తప్పడం లేదు. దీంతో అబీద్ సెంటర్ నుంచి పాల్‌ఘాట్ సెంటర్ వరకు ఉన్న వంద అడుగులు మెయిన్ రోడ్డు పాడవుతున్నది. పైపులు మరమ్మతులు చేసిన తర్వాత వాహనాలుదారులు గోతిలో పడి ప్రమాదం బారిన పడకుండా అప్రమత్తం చేయడానికి రోడ్డు మధ్యలో ఉన్న రంధ్రంలో చుట్టు కొమ్మను ఉంచారు. ఏదేమైనా ఈ సమస్యతో వాహన చోదకులు నరకం చూస్తున్నారు. ఇది వారికి ప్రమాదకరంగా పరిణమించింది.

చిన్నారిపై హత్యాచారం చేసిన వ్యక్తిని శిక్షించాలి



నినాదాలు చేస్తున్న నాయకులు, గ్రామస్థులు

చీడికాడ, మే 23 (ఆంధ్రజ్యోతి): కడపలో ఓ చిన్నారిపై హత్యాచారం చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని మహాజన సోషలిస్ట్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ మారడపూడి నాగరాజు కోరారు. ఈ సందర్భంగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జైతవరం గ్రామంలో శుక్రవారం నిరసన తెలిపారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ చిన్నారిపై హత్యాచారం చేసిన యువకున్ని తక్షణమే ఉరితీయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కంటిపాము గుమ్మాలు, గంగరాజు, మంగయ్య, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నడవలేని వారి ఇంటికే రేషన్ ఇవ్వండి

▸▸ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

▸▸ పాత విధానంలో రేషన్ మంజూరుతో డీలర్ల హర్షం

మాడుగుల/చీడికాడ, మే 23 (ఆంధ్రజ్యోతి): వృద్ధులు, దివ్యాంగులు తదితర నడవలేని స్థితిలో ఉన్న వారికి ఇంటికి వెళ్లి రేషన్ సరకులు ఇవ్వాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తిని సూచించారు. పాత విధానంలో రేషన్ పంపిణీపై డీలర్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మాడుగుల పంచాయతీరాజ్ శాఖ అతిథి గృహంలో శుక్రవారం మాడుగుల, చీడికాడ మండలాల డీలర్ల సంఘం నాయకులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రోడ్లపైనే ఎండీఎం వాహనాలు నిలిపి రేషన్ సరకులు అందించే సమయంలో క్యూలో నిలబడే పరిస్థితులు ఉన్నాయని గుర్తుచేశారు. వాహనం ఏ సమయంలో వస్తుందో తెలియక లబ్ధిదారులు పనులు మానుకొని ఎదురుచూసేవారన్నారు. రేషన్ దుకాణాల ద్వారా 25 రోజుల వ్యవధిలో ఏదో రోజు సరకులు తీసుకునేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాడుగుల, చీడికాల మండలా రేషన్ డీలర్ల సంఘం ప్రతినిధులు చింత వెంకట నారాయణమూర్తి, ఈర్ని సురేశ్, పెంటకోట జగన్నాథరావు, పుట్టా ప్రకాశ్, నందారపు రమణబాబు, బొడ్డు మహలక్ష్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తిని సన్మానిస్తున్న రేషన్ డీలర్లు

కష్టపడి పనిచేసే కార్యకర్తలకు సముచిత స్థానం

▸▸ చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు

రోలుగుంట, మే 23 (ఆంధ్రజ్యోతి): క్షేత్ర స్థాయిలో కష్టపడి పనిచేసే ప్రతీ కార్యకర్తకు సముచిత స్థానం కల్పిస్తామని చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు చెప్పారు. మండల కేంద్రంలోని పాల కేంద్రం ఆవరణలో శుక్రవారం నిర్వహించిన నాయకులు, కార్యకర్తల సమావేశంలోఆయన మాట్లాడారు. తన విజయానికి కృషి చేసిన ప్రతీ ఒక్కరికీ రుణపడి ఉంటానన్నారు. అవినీతి చేసే ఎమ్మెల్యేను కాదని, గ్రామాలను అభివృద్ధి చేసే ఎమ్మెల్యేనని ఆయన పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి రాజీ లేని పోరాటం చేయాలని కోరారు. అనంతరం టీడీపీ మండల అధ్యక్షడి ఎంపికపై సమీక్ష నిర్వహించారు. 24 పంచాయతీల నాయకులు, కార్యకర్తలతో గ్రామాల వారీగా విడివిడిగా సమావేశమై నూతన అధ్యక్షుడి ఎంపికపై అభిప్రాయాలను సేకరించారు. రెండు రోజుల్లో పార్టీ మండల అధ్యక్షుడి ఎంపిక పూర్తి చేసి ప్రకటిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రస్తుత మండల అధ్యక్షుడు గుములూరు చంద్రమౌళి, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు పంచాడ చంద్ర, ఎంపీటీసీ సభ్యుడు సుర్ల రామకృష్ణ, నాయకులు సుర్ల బాబులునాయుడు, బంటు రాజు, శ్యామల, రొంగలి ర ాణ, సబ్బవరపు పెద్దినాయుడు, కోలిపల్లి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పార్టీ నేతలు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

భూమి ఒకరిది.. ఆన్‌లైన్‌లో పేరు మరొకరిది!

▸▸ జగనన్న భూ సర్వేలో మోసంపై తహసీల్దార్‌కు ఫిర్యాదు

బుచ్చెయ్యపేట, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదమదిన గ్రామంలో తమ ప్రమేయం లేకుండానే రీ సర్వేలో ఇద్దరు వ్యక్తుల పేరిట రెవెన్యూ అధికారులు వెబ్‌ల్యాండ్‌లో భూమిని మార్చేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ ఎం.లక్ష్మికి బాధితులు నక్కా కొండమ్మ, నక్కా సింహాచలం వినతిపత్రం సమర్పించారు. పెదమదిన రెవెన్యూలో 200/4 సర్వే నంబర్‌లో 84 సెంట్ల భూమి తనకు వారసత్వంగా దఖలు పడిందని నక్కా సింహాచలం చెప్పారు. తనకు ఈశ్వరరావు, రాంబాబు అనే ఇద్దరు కుమారులు ఉన్నారన్నారు. వీరిలో ఈశ్వరరావు మరణించగా, రాంబాబు అనారోగ్యంతో మంచానికే పరిమితమయ్యారు. రాంబాబు కుమారుడు సింహాచలం, ఈశ్వరరావు భార్య కొండమ్మ సంబంధిత భూమిని పెదమదినకు చెందిన నమ్మి శ్రీను, అనకాపల్లి మండలానికి చెందిన బొట్ట శ్రీనుకు రూ.14 లక్షలకు 2019లో అమ్మకానికి ఒప్పందం రాశారని, 2023లో రీ సర్వేలో రెవెన్యూ సిబ్బందితో కుమ్మక్కై వారి పేరుతో భూమిని ఆన్‌లైన్‌లో మార్పించుకున్నారని నక్కా సింహచలం, కొండమ్మ వాపోయారు. తమ భూమిని తిరిగి ఆన్‌లైన్‌లో తమ పేరుతో నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ భూమి తమకు దక్కకపోతే ఆత్మహత్యలే శరణ్యమని వాపోయారు.



తహసీల్దార్‌కు ఫిర్యాదు పత్రం అందజేస్తున్న బాధితులు

నాతవరం రహదారిలో ప్రమాదకరంగా కల్వర్టు

నాతవరం, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాండవ జంక్షన్-నాతవరం ఆర్అండ్‌బీ రహదారిలో కల్వర్టు ప్రమాదకరంగా తయారైంది. ఈ మార్గంలోని వెన్నలపాలెం వద్ద కల్వర్టు దెబ్బతింది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు.

ఈ రహదారి మధ్యలో ఉన్న కల్వర్టు ఒకవైపు పెద్ద రంధ్రం ఏర్పడింది. దీంతో స్థానిక ప్రజలు ఈ కల్వర్టు రంధ్రం చుట్టూ కట్టెలు ఏర్పాటు చేశారు. అయితే పగటి వేళలలో ప్రయాణికులు, వాహన చోదకులు దీన్ని గమనిస్తూ దూరం నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. రాత్రి సమయాల్లో మాత్రం కొత్తగా వచ్చే ప్రయాణికులు కల్వర్టు దెబ్బతిన్న విషయం గమనించలేకపోతున్నారు. ఏమాత్రం అజాగ్రత్త వహించినా ప్రమాదం తప్పదని వారు భయాందోళన చెందుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి వెన్నలపాలెం దగ్గర దెబ్బతిన్న కల్వర్టుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు.



తాండవ జంక్షన్-నాతవరం రోడ్డులో వెన్నలపాలెం వద్ద దెబ్బతిన్న కల్వర్టు

విభిన్న ప్రతిభావంతునికి త్రిచక్ర వాహనం అందజేత



వాహనం తాళం అందిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, మే 23 (ఆంధ్రజ్యోతి): రావికమతం మండలం రోచుపణుకు గ్రామానికి చెందిన విభిన్న ప్రతిభావంతుడు తూర్రి రవికి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ శుక్రవారం ఇక్కడ త్రిచక్ర వాహనాన్ని అందజేశారు. కలెక్టర్ వినతి మేరకు అచ్యుతాపురం సెజ్‌లో గల టొయోటా రేర్ ఎర్త్ కంపెనీ సీఎస్ఆర్ నిధులతో దీనిని సమకూర్చింది. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ సుధాకర్, కంపెనీ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ మురళీధర్ పాల్గొన్నారు.

తూర్పు కాపు విద్యార్థుల నుంచి ఉపకార వేతనాలకు దరఖాస్తులు

కొత్తూరు, మే 23 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది జరిగిన పదో తరగతి పరీక్షల్లో 500 మార్కులకు పైగా సాధించిన తూర్పు కాపు విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తూర్పు కాపు సంఘం మండల అధ్యక్షుడు పోలిన సూర్య జగ్గారావు శుక్రవారం తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు తమ హాల్‌టికెట్, కుల, ఎస్ఎస్‌సీ మార్కుల జాబితా పంపించాలన్నారు. అర్హులంతా 98666 87859, 99898 89442 నంబర్ల ద్వారా రిజిస్ట్రేషన్ కావాలని సూచించారు.

పాలిటెక్నిక్ కళాశాలలో అడ్మిషన్లు

కశింకోట, మే 23 (ఆంధ్రజ్యోతి): రాజీవ్‌గాంధీ ఆర్ఈసీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో సంస్థ ఉద్యోగులు, వినియోగదారుల పిల్లలకు కేటాయించిన 50 శాతం సీట్ల ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తుల విక్రయం శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జి.ప్రసాద్ మాట్లాడుతూ అడ్మిషన్లు ప్రారంభించామని, కళాశాల పనివేళల్లో దరఖాస్తులు పొందవచ్చునని చెప్పారు.

విద్యార్థుల పట్టుదల అమోఘం: ఎమ్మెల్యే రాజు



దివ్యాంగ విద్యార్థులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రాజు

రావికమతం, మే 23 (ఆంధ్రజ్యోతి): మానసిక దివ్యాంగులైనప్పటికీ పట్టుదలతో జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక కావడం అమోఘమని ఇద్దరు ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు అన్నారు. జాతీయ స్థాయి ఒలింపిక్ క్రీడా పోటీలకు ఎంపికైన కొమిర గ్రామానికి చెందిన అప్పికొండ గణేశ్, నక్కరాజు బాల సరస్వతిలను శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, దివ్యాంగులైనప్పటికీ పట్టుదల, కృషితో క్రీడల్లో ఎంతో నైపుణ్యత కనబర్చడం అభినందనీయమన్నారు. జాతీయ స్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబర్చి మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. అలాగే వారికి శిక్షణ ఇచ్చిన ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు, జగన్నాథనాయులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రాజాన కొండనాయుడు పాల్గొన్నారు.

పండ్ల దుకాణాలపై అధికారుల దాడులు



పండ్ల దుకాణం వద్ద కేసులు రాస్తున్న అధికారి శ్రీజ

మాడుగుల, మే 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పండ్ల దుకాణాలపై ఆహార భద్రత శాఖ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. మామిడి, అరటి వంటి పలు ఫలాలకు రసాయనాలు కొట్టి ముగ్గిస్తున్నారని, దీనివల్ల క్యాన్సర్ వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని అనకాపల్లి ఫుడ్ సేఫ్టీ అధికారిణి ఎన్.శ్రీజ తెలిపారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా పలు దుకాణాల వద్ద అమ్ముతున్న పండ్ల శాంపిళ్లను సేకరించామన్నారు. వీటిని ల్యాబ్‌కు పంపిస్తామని, ల్యాబ్ రిపోర్టు ఆధారంగా రసాయనాల ద్వారా పండించినట్టు తేలితే వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాడుగుల పోలీసు సిబ్బంది సుధాకర్ పాల్గొన్నారు.

నాగదుర్గమాంబ విగ్రహ ప్రతిష్ఠ

కె.కోటపాడు, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.సంతపాలెం గ్రామంలో నాగదుర్గమాంబ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నూతనంగా ఆలయం నిర్మించిన ఆలయంలో వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రొంగలి మహేశ్, నాయకులు ఎస్.రామునాయుడు, కన్నూరు సూర్యనారాయణ, చుక్క రమణ, వాకాడ చిన్న, చల్లా సత్యం, బి.సింహాద్రప్పడు, వి.దేముళ్లు, పైలా స్వామి నాయుడు, చల్లా సన్యాసినాయుడు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఉపాధ్యాయుల ప్రచారం

రోలుగుంట, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని కోరుతూ ఉపాధ్యాయులు శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సీఆర్పీ సతీశ్ ఆధ్వర్యంలో కొండపాలెం, కె.నాయుడుపాలెం గ్రామాల్లో ఇంటింటా ప్రచారం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు భోజన సౌకర్యం అందుతుందన్నారు. శతశాతం ఇంగ్లీషు మీడియంతో విద్యా బోధన సాగుతుందన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

సెల్, నెట్ సిగ్నల్స్ అంతరాయంతో వినియోగదారుల ఇక్కట్లు

కృష్ణాదేవిపేట, మే 23 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని కృష్ణాదేవిపేటతో పాటు పరిసర గ్రామాల్లో సెల్, నెట్ సిగ్నల్స్ అంతరాయంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారం రోజులుగా 4జీ సేవలకు పలుమార్లు అంతరాయం ఏర్పడుతోంది. అలాగే బీఎస్ఎన్ఎల్ సిగ్నల్స్ కూడా సరిగ్గా లేకపోవడం, ఇతర నెట్‌వర్క్ సేవలు గంటలు తరబడి స్తంభించిపోవడంతో వినియోగదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సెల్, నెట్ సిగ్నల్స్‌కు అంతరాయం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని కృష్ణాదేవిపేట, కొంగసింగి, నాగాపురం, కొండగోకిరి తదితర గ్రామాల వినియోగదారులు కోరుతున్నారు.

గ్యాస్ సిలిండర్ డబ్బులు ఖాతాల్లో పడేలా అధికారులు చూడాలి

నాతవరం, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చాలా మంది లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ డబ్బులు పడడం లేదని, ఈ సమస్యను అధికారులు పరిష్కరించి ఖాతాల్లో డబ్బులు పడేలా చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు కోరారు. ఏడాదికి మూడు విడతల్లో ఉచిత గ్యాస్ సిలిండర్లను కూటమి ప్రభుత్వం ఇస్తానని ప్రకటించడమే కాకుండా మొదటి విడతలో లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు వేసిందని చెప్పారు. అయితే మండలంలో కొంత మంది లబ్ధిదారులకు గ్యాస్ బుక్ చేసి డబ్బులు కట్టినా, ఖాతాల్లో జమ కాలేదన్నారు. అలాగే రెండో విడతలో కూడా ఉచిత గ్యాస్ డబ్బులు పడడం లేదన్నారు. ఈ విషయంలో అధికారులు తక్షణమే స్పందించి లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు.

అజయ్‌పురంలో ప్రత్యేక వైద్య శిబిరం

రావికమతం, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోనిచీమలపాడు పంచాయతీ శివారు అజయ్‌పురం గ్రామంలో శుక్రవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. కొత్తకోట పీహెచ్‌సీ వైద్యాధికారి రజిని ఆధ్వర్యంలో సిబ్బంది 30 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించగా, వీరిలో ఆరుగురికి సాధారణ జ్వరాలు ఉన్నట్టు నిర్ధారణ జరిగింది. జ్వర బాధితులకు అవసరమైన చికిత్స చేశామని, మిగిలిన బాధితులకు కూడా మందులను అందజేశామని డాక్టర్ రజిని తెలిపారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున కాచి ఒడబోసిన నీటినే తాగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమతెరలను వినియోగించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి పాతాళ రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

జనసేన పార్టీ జిల్లా ఇన్‌చార్జి పంచకర్ల పర్యటన రేపు

మాడుగుల రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ రూరల్ జిల్లా అధ్యక్షుడు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఆదివారం మండలంలో పర్యటిస్తారు. ఉదయం పది గంటలకు ఘాట్ రోడ్డు జంక్షన్‌లోని పార్టీ కార్యాలయానికి వస్తారని, ఈ సందర్భంగా పార్టీ అభివృద్ధి కార్యక్రమాలు, పలు అంశాలపై జన సైనికులతో చర్చిస్తారని నాయకులు చెప్పారు. అలాగే ఘాట్ రోడ్డు జంక్షన్ నుంచి కింతలి వల్లాపురం గ్రామం వరకు బైక్ ర్యాలీ ఉంటుందన్నారు.

రాజాం చెరువు గట్టుపై ఆక్రమణలు తొలగిస్తాం: తహసీల్దార్

బుచ్చెయ్యపేట, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజాం జంక్షన్‌లో చెరువు గట్టును ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని, వారందరికీ నోటీసులు అందజేస్తామని తహసీల్దార్ ఎం.లక్ష్మి తెలిపారు. శుక్రవారం విలేకరులతో ఆమె మాట్లాడుతూ చెరువు గట్టుపై కొంత మంది సుదీర్ఘకాలంగా ఆక్రమణలకు పాల్పడి శాశ్వత, తాత్కాలిక నిర్మాణాలు చేపట్టారన్నారు. కొంతమంది వాణిజ్య కట్టడాలు రూడా నిర్మించారని చెప్పారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేస్తారని, సర్వే జరిపించి అక్రమాలను గుర్తిస్తామని, కట్టడాలను తొలగిస్తామని ఆమె స్పష్టం చేశారు.

26 నుంచి సత్యసాయి ప్రేమ రథయాత్ర

దేవరాపల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లాలో ఈ నెల 26వ తేదీ నుంచి సత్యసాయి ప్రేమ రథాయాత్ర నిర్వహిస్తామని సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు చెప్పారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాలుగు ప్రేమ రథాలు దేశమంతా తిరుగుతున్నాయని చెప్పారు. ప్రతీ మండలంలో ప్రధాన మార్గాల మీదుగా ఈ యాత్ర సాగుతుందన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో స్వాగతం పలకాలని ఆయన కోరారు. సమావేశంలో జోన్ ఇన్‌చార్జి సిహెచ్‌వీ.రవిశంకర్, సేవాదళ్ ఇన్‌చార్జి కె. అప్పలనాయుడు పాల్గొన్నారు.

నేడు తిరంగా ర్యాలీ

చీడికాడ, మే 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం తిరంగా ర్యాలీ నిర్వహిస్తామని బీజేపీ మండల అధ్యక్షుడు పి.బాలకృష్ణ తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు ర్యాలీ ప్రారంభిస్తామన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు డి.పరమేశ్వరరావు ర్యాలీకి హాజరవుతారన్నారు. కూటమి నాయకులు, ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పర్యాటక శాఖలో కారుణ్య నియామకం



మహేందర్‌కు నియామక పత్రం అందజేస్తున్న మయూరి హిల్ రిసార్ట్స్ మేనేజర్ దేముడుబాబు

అరకులోయ, మే 23 (ఆంధ్రజ్యోతి): పర్యాటక శాఖలో హెల్పర్ విధుల్లో ఉంటూ లోలిత్ అనే వ్యక్తి మూడు నెలల కిందట హఠాత్తుగా మృతి చెందారు. ఈ నేపథ్యంలో పర్యాటక శాఖ ఉన్నతాధికారులు అతని కుమారుడు మహేందర్‌కు అదే జనరల్ హెల్పర్ పోస్టు కేటాయిస్తూ ఉత్వర్వులు జారీ చేశారు. శుక్రవారం ఈ నియామక పత్రాన్ని స్థానిక హరిత మయూరి రిసార్ట్‌లో మేనేజర్ సీహెచ్. దేముడుబాబు అందజేశారు. మహేందర్‌కు ఉద్యోగ అవకాశం కల్పించడంతో ఏపీటీడీసీ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) ఆమ్రపాలి, ఈడీ ఎ.ఎ. పద్మావతి, డీఎం జి.వి.బి.జగదీశ్‌కు లోలిత్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

బాల్య వివాహాలు నేరం



వి.కొత్తూరులో కిశోర వికాసంపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

జి.మాడుగుల, మే 23 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు నేరమని, వీటిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని అంగన్‌వాడీల సూపర్ వైజర్లు విజయలక్ష్మి, ఎం.లక్ష్మి, ఎస్. సత్యవతి సూచించారు. మండలంలోని శుక్రవారం పాలమామిడి పంచాయతీ చిన్నబంధవీధి, సింగర్బ సెక్టారు పరిధి అంగన్‌వాడీల కేంద్రాల్లో కిశోర వికాసం సమ్మర్ క్యాంప్‌లో భాగంగా 11 నుంచి 18 ఏళ్ల వయస్సు కలిగిన బాలికలకు అవగాహన కల్పించారు. పోషకాహారం, లింగవక్షత, మహిళలు ఆత్మరక్షణ, పోక్సో చట్టం, మానవ అక్రమ రవాణా తదితర అంశాలపై క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు రత్నకుమారి పాల్గొన్నారు.

మండలానికి చేరిన పాఠ్య పుస్తకాలు



పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈవో రాంబాబు

కొయ్యూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 152 పాఠశాలలకు 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్య పుస్తకాలు సరఫరా అయినట్టు ఎంఈవో రాంబాబు తెలిపారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత తరగతులకు చెందిన విద్యార్థులకు 28, 201 పాఠ్యపుస్తకాలు, 41756 నోట్ బుక్స్ వచ్చినట్టు వివరించారు. వీటిని పాఠశాలల పునఃప్రారంభం రోజున వీటిని పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నట్టు ఎంఈవో వివరించారు.

సెప్టిక్ ట్యాంక్‌లో పడి ఆవు మృతి

మరో పశువును రక్షించిన స్థానికులు



ఆవును తాళ్లతో తీస్తున్న దృశ్యం

సీలేరు, మే 23 , (ఆంధ్రజ్యోతి): సీలేరు లో ఏపీ జెన్‌కో కాలనీలో సెప్టిక్ ట్యాంక్‌లో రెండు ఆవులు ప్రమాద వశాత్తు పడిపోయాయి. వీటిలో ఒక ఆవు మృతి చెందగా, మరొక దాని ప్రాణాలను స్థానికులు రక్షించారు. కాల నీలోని అరు, ఏడు క్రాస్ రోడ్ల మధ్యన మరుగుదొడ్ల సెప్టిక్ ట్యాంక్ నుంచి దుర్వాసన వస్తుండడంతో గమనించిన కొంతమంది వెళ్లి పరిశీలించారు. గోతిలో రెండు ఆవులు పడిపోయి ఉన్నాయి.వీటిలో మృతి చెంది ఉండగా, మరొకటి ప్రాణాలతో కొట్టుమిట్టాడుతోంది. వెంటనే స్థానికులు జేసీబీ సహాయంలో ఈ ఆవును బయటకు తీశారు. మృతి చెందిన ఆవును అక్కడే గొయ్యి తీసి పూడ్చిపెట్టారు.గ్రామ పెద్దలు కారే శ్రీనివాస్, సర్పంచ్ దుర్జో, ఏపీ జెన్‌కో ఫోర్ మెన్ బుట్టో పాల్గొన్నారు.

తాగునీటి బోరు పనులు

గూడెంకొత్తవీధి: పూ జారి పాకలు బోడకొండ శాకంబరీదేవి ఆలయం వద్ద తాగునీటి బోరు పనులను సర్పంచ్ సుభద్ర శుక్రవారం ప్రారంభించారు. మండల పరిషత్ నిధులతో బోరు నిర్మిస్తున్నట్టు ఆమె తెలిపారు. ఉప సర్పంచ్ రాంబాబు , పెద్దలు పాల్గొన్నారు.

మండల కేంద్రాల్లో 'మీ కోసం'కు స్పందన కరవు

- అవగాహనలేక వినియోగించుకోని గిరిజనం
- పాడేరు పీజీఆర్‌ఎస్‌కి వెళుతున్న ప్రజలు



చింతపల్లిలో అర్జీదారుల కోసం నిరీక్షిస్తున్న అధికారులు (ఫైల్)

చింతపల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): మండల స్థాయిలో ప్రతి సోమవారం నిర్వహించే మీకోసం కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన కరువైంది. దీనిపై ప్రజల్లో అవగాహనాలోపంతో వివిధ ప్రాంతాల ప్రజలు శుక్రవారం జిల్లా కేంద్రమైన పాడేరులో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)కి వెళ్లి సమస్యలపై అర్జీలు, ఫిర్యాదులు అందజేస్తున్నారు. ప్రభుత్వం జిల్లా కలెక్టర్‌ను ప్రజల సమస్యలను సత్వర పరిష్కారంచూపడంతోపాటూ ప్రయాణభారంతగ్గించేందుకు ప్రతి సోమవారం మండల స్థాయిలో వివిధశాఖల అధికారులతో మీకోసం కార్యక్రమం నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈనేపథ్యంలో రెండు నెలలుగా ప్రతి సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో, తహసీల్దార్ ఆధ్వర్యంలో వివిధశాఖ అధికారులు మీకోసం నిర్వహిస్తున్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, వినతులను అధికారులు స్వీకరించిన ఆన్‌లైన్‌లో నమోదు చేసి రశీదు అందజేస్తున్నారు. అయితే, పాడేరులో నిర్వహించే పీజీఆర్ ఎస్‌కి వెళ్లి కలెక్టర్, ఐటీడీఏ పీవోకి వినతి పత్రం అందజేస్తేనే సమస్య పరిష్కారమవుతుందని ప్రజలు విశ్వసిస్తున్నారు. దీని వల్ల మండలస్థాయిలో ఒకటీ, రెండు వినతులకు మా త్రమే పరిమితమవుతున్నాయి. ఫలితంగా మండలస్థాయి అధికారులు మొక్కుబడిగా మీకోసం నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంటోంది. చింతపల్లి మండలాన్ని పరిశీలిస్తే రెండువారాలుగా మీకోసం కార్యక్రమానికి ఒక్క గ్రీవెన్స్ రాలేదు. ఇప్పటికైనా అధికార యంత్రంగా మండల స్థాయిలో సోమవారం నిర్వహించే మీకోసంలో అధికారులకు ప్రజల సమస్యలపై వినతులు, అర్జీలు అందజేస్తే పరిష్కారం లభిస్తుందనే నమ్మకం కల్పించాలి. ఈ అంశంపై గ్రామ సచివాలయం పరిధి గ్రామాల్లో విస్తృత ప్రచారం కల్పించాలి. ఈ మేరకు చర్యలు తీసుకుంటే పాడేరులో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక వచ్చే ప్రజల సంఖ్య తగ్గుతుంది. మండల స్థాయిలోనే మెజారిటీ సమస్యలను పరిష్కరించే అవకాశం కలుగుతుంది.

మండలాలకు టీడీపీ అధ్యక్షుల నియామకం

అరకులోయ, మే 23 (ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు అరకు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల్లో పార్టీ అధ్యక్షులను ఎంపిక చేసినట్టు విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్, అరకు ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర తెలిపారు. శుక్రవారం రాత్రి తన నివాసంలో అధ్యక్షుల పేర్లను ప్రకటించారు. గత 12 ఏళ్లుగా పార్టీ మండల అధ్యక్షులుగా ఉన్న వారిని తప్పించి, వారి సేవలను జిల్లా, రాష్ట్ర స్థాయి పరిధిలో వినియోగించుకోవాలని అధిష్ఠానం నిర్ణయించిందన్నారు. ఈ నేపథ్యంలో యువ నాయకత్వాన్ని ఎంపిక చేశామన్నారు. అరకులోయ మండలం అధ్యక్షుడిగా పద్మాపురం మేజర్ పంచాయతీ సర్పంచ్ లక్కోయి మహదేవ్, అనంతగిరి మండలానికి సోవేరి సుబ్బారావు, డుంబ్రిగుడకు కిల్లో ఆనందరావు, హుక్కుంపేటకు శతక బొంజుబాబు, పెదబయలుకు వెచ్చంగి కొండయ్య, హుక్కుంపేట మండలం తెలుగు మహిళా అధ్యక్షురాలిగా కిల్లో సన్యాసమ్మలను నియమించినట్లు దొన్నుదొర ప్రకటించారు. ఈ సమావేశంలో అరకులోయ నాయకుడు శెట్టి బాబురావు పాల్గొన్నారు.

'ఫిర్యాదు చేస్తాం'

అనంతగిరి: టీడీపీ కోసం అహర్నిశలు శ్రమించే నాయకులను గుర్తించాలని టీడీపీ మండల అధ్యక్షుడు అంటిపర్తి బుజ్జిబాబు, పలువురు నాయకులు అన్నారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. గ్రామ కమిటీలు, మండల కమిటీ ఎన్నికల్లో కనీసం సీనియర్ నాయకులకు సమాచారం ఇవ్వకుండా ఇష్టానుసారంగా ఎంపికలు చేస్తున్నారని ఆ వేదన వ్యక్తంచేశారు. ప్రతిపక్షంలోనూ, పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పార్టీ వెన్నంటి ఉంటూ అనేక అవమానాలను సైతం భరించామ న్నారు. ఇప్పుడు ఒకే వర్గానికి కొమ్ముకాసేలా పార్టీ కమిటీలు ఎంపిక తగదన్నారు. ఈ స్థితిలో సీఎం చంద్రబాబు, లోకేశ్, గిరిజన శాఖా మంత్రిని కలిసి కలిసి ఇన్‌చార్జి దొన్నుదొర తీరుపై వివరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు కె.అప్పారావు, ప్రధాన కార్యదర్శి టి.ఆనందరావు, కార్యవర్గ సభ్యులు ఎం. జోగులు,సమర్థి దొన్ను, సారా దొన్ను, ద యానిధి, సుందరరావు,ఎమ్.శ్యామ్ పాల్గొన్నారు.



అధ్యక్షుల పేర్లు ప్రకటిస్తున్న దొన్నుదొర

రిడే బందలో పాఠశాల భవనం నిర్మించాలి

- పాడేరు ఐటీడీఏ ఎదుట గ్రామస్థులు ఆందోళన



ఐటీడీఏ ఎదుట వైస్ ఎంపీపీ కొండలరావు ఆధ్వర్యంలో నిరసన

హుకుంపేట మే 23 ఆంధ్రజ్యోతి; మండలంలోని రాప పంచాయతీ పరిధి రీడే బంద గ్రామంలో పాఠశాల భవనం మంజూరు చేసి, ఉపాధ్యాయుడిని నియమించాలని స్థానిక వైస్ ఎంపీపీ కొండలరావు, గ్రామస్థులు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పాడేరు ఐటీడీఏ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం స్పందనలో కలెక్టర్ దినేశ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మాట్లాడుతూ రీడే బందలో కనీసం ప్రభుత్వ పాఠశాల భవనం లేదని,40 విద్యార్థులకుఇక్కడ వలంటీర్‌తో బోధన సాగుతుందన్నారు. పాఠశాల భవనం లేక వర్షా కాలంలో పిల్లలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు.అధికారులు స్పందించి ఉపాధ్యాయుడు నియమించాలని డిమాండ్ చేశారు. అలాగే, తడిగిరి పంచాయతీ నుంచి కొండచిడిపుట్టువరకు తారురోడ్డు ఏర్పాటు చేయాలనికోరారు.లేకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకుడు రామారావు, మల్లేశ్, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకు పెద్దపీట

- టీడీపీ పాడేరు ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి



కుట్టు శిక్షణకు హాజరైన మహిళలతో మాట్లాడుతున్న గిడ్డి ఈశ్వరి

చింతపల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని టీడీపీ పాడేరు నియోజక వర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి అన్నారు. శుక్రవారం స్థానిక గ్రామ సచివాలయంలో బీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 14మంది బీసీ, 11మంది కాపు మహిళలకు ప్రభుత్వం కుట్టు మిషన్ నిర్వాహణపై శిక్షణ నందించడంతోపాటు అనంతరం ధ్రువ పత్రాలతోపాటు కుట్టు మిషన్ అందజేస్తారన్నారు. ఈ శిక్షణతో మహిళలు కుటుంబానికి చేదోడు, వాదోడుగా నిలవాలన్నారు. అలాగే, డ్వాక్రా సంఘాలకు బ్యాంక్ రుణాలతో పలువురు స్వయం ఉపాధి పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు, ఎంపీపీ కోరాబు అనుషదేవి, సర్పంచ్ దురియా పుష్పలత, ఎంపీటీసీ సభ్యురాలు జయలక్ష్మి, టీడీపీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు, నాయకులు రీమల ఆందరావు, పెదిరెడ్ల భేతాళుడు, సోమేశ్, నాగభూషణం, నాజర్‌వల్లి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకుమార్, గుమస్తా అంబేడ్కర్, బీసీ కార్పొరేషన్ కోఆర్డినేటర్ కె.రవి కుమార్ పాల్గొన్నారు.

ముంచంగిపుట్టులో భారీ వర్షం

ముంచంగిపుట్టు, మే 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో పలు చోట్ల గురువారం అర్థరాత్రి భారీ వర్షం కురిసింది. శుక్రవారం తెల్లవారు జాము వరకు కురిసిన వర్షానికి పలు చోట్ల వాగులు వంకలు ఉధృతంగా ప్రవహించాయి. రహదారులు చిత్తడిగా మారాయి. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మత్స్యగెడ్డ పరివాహంలో ఉన్న జోలాపుట్టు జలాశయంలోకి వరద నీరు వచ్చి చేరవడంతో కళకళలాడుతుంది. ఈ ఏడాది రికార్డు స్థాయిలో నీటిమట్టం నమోదైంది.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి: డీఎస్పీ



మాట్లాడుతున్న డీఎస్పీ షేక్ షాహబాద్

పాడేరురూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): యువత పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రతీ నెలా నిర్వహిస్తున్న జాబ్ మేళా, స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని డీఎస్పీ షేక్. షాహబాద్ అహ్మద్ సూచించారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాడేరులో రోజు రోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలను చేపడుతున్నామన్నారు. ప్రధాన రహదారుల్లో నిర్లక్ష్యంగా వాహనాలను నిలిపి వే యడం వల్ల ట్రాఫిక్ సమస్య ఎదురవుతుందన్నారు. దీనిపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రధాన రహదారిలో ఉన్న షాపుల యజమానులు ముందుకు వచ్చి, కాలువలు ఆక్రమించి అమ్మకాలను చేపడుతున్నారని, వీటి నియంత్రణకు చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి నియంత్రణకు పోలీస్ శాఖ పటిష్ఠ చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. ఎస్‌ఐ ఎల్.సురేశ్ పాల్గొన్నారు.

సర్వేలు పూర్తి చేయాలి: ఎంపీడీవో



రింతాడ సంచివాలయం- 1 ను తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి, మే 23 , (ఆంధ్రజ్యోతి) : సచివాలయాల పరిధిలోని ప్రభుత్వం సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని జీకేవీధి ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు సూచించారు. శుక్రవారం రింతాడ సచివాలయం- 1ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ యోగాంధ్రకు సంబంధించిన అంశంపై ఒక్కొక్కరూ 50 మందిని రిజిస్ట్రేషన్ చేయాలని , చిన్న పిల్లల ఆధార్ నమోదు పూర్తి చేయాలని ఆదేశించారు.

సూపర్ 50 ఫలితాలపై అకడమిక్ బృందం అధ్యయనం

- గిరిజన సంక్షేమ శాఖ డీడీ ఎల్.రజని



నినాదాలతో ర్యాలీ చేస్తున్న టీడీపీ, బీజేపీ నాయకులు

పాడేరురూరల్, మే 23(ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ పరిధిలో సూపర్ 50 విద్యార్థులు పది పరీక్షలో సాధించిన ఉత్తమ ఫలితాలపై రాష్ట్ర అకడమిక్ బృందం అధ్యయనం చేస్తోందని గిరిజన సంక్షేమ డీడీ ఎల్. రజని తెలిపారు. పాడేరు మండలం గుత్తులపుట్టు గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో బాలికలకు, దిగుమోదాపుట్టు బాలుర ఆశ్రమ పాఠశాలలో బాలురకు ప్రత్యేక బోధన అందించిన విషయం విదితమే. ఈ విద్యార్థులు పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించారు. దీంతో రాష్ట్ర అకడమిక్ మోనటరింగ్ యూనిట్ బృంద సభ్యులు శుక్రవారం స్థానిక లోచలపుట్టుఆశ్రమ పాఠశాలలో దిగువ మోదాపుట్టు పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశమై చర్చించారు. విద్యార్థులకు అందించిన ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించిన విధానంపై చర్చించారు. శనివారం గుత్తులపుట్టు పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులు, విద్యార్థినులు, వారి తల్లిదండ్రులతో సమావేశ మవుతారని ఆమె తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గిరిజన విద్యా సంస్థల్లో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక బోధన అమలు చేయాలనే యోచన చేస్తున్నారన్నారు. ఈ అధ్యయనంలో డీడీ ఎల్.రజని, బృంద సభ్యులు టి.శ్రీనివాసరావు, జి. జాన్సన్ దేవరాజు, కె.శివ కుమార్, దిగుమోదాపుట్టు పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెదబయలులో తిరంగా ర్యాలీ



ర్యాలీ చేస్తున్న టీడీపీ, బీజేపీ నాయకులు

పెదబయలు, మే 23 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా త్రివిధ దళాలు నిర్వహించిన ఆపరేషన్ సింధూర్ విజయాన్ని పురస్కరించుకుని శుక్రవారం కూటమి నాయకులు తిరంగా ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాలను చేత పట్టుకొని స్థానిక హెచ్‌పీ పెట్రోల్ బంక్ నుంచి అంబేడ్కర్ కూడలి వరకు భారత్ మాతాకీ జై, వందేమాతరం అంటూ నినాదాలు చేశారు. ఈ పోరాటంలో అమరులైన జవానులకు నివాళులర్పించారు. అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు కొండపల్లి రాంబాబు మాట్లాడుతూ దేశ సార్వభౌమత్వాన్ని కాపాడటానికి ప్రజలందరూ ఐకమత్యంతో సైన్యానికి మద్దతుగా నిలవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ విద్యార్థి పరిషత్ రాష్ట్ర నాయకుడు, మన్యం జిల్లా కన్వీనర్ అల్లంగి మహేశ్‌బాబు, సోమేశ్, ఆనంద్, మాధవరావు, శ్రీను, చిన్నయ్య, జయరాం, పరుశురామ్, రాంబాబు, ధర్మన్న, దేవన్న, రామ్‌చందర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో ..'నవరత్న' ప్రచారం!

- రంగశీల సచివాలయం వద్ద మాజీ సీఎం జగన్ ఫొటోతో ఫ్లెక్సీ
- తొలగింపులో తాత్సారం



రంగశీల గ్రామ సచివాలయ గోడలపై జగన్ ఫొటోలతో ఫ్లెక్సీలు

హుకుంపేట మే 23 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా..సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో కొన్నిచోట్ల ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వం అమలు చేసి నవరత్నాల పథకాల ఫ్లెక్సీలను ఇంకా తొలగించలేదు. మండలంలో రంగశీల సచివాలయం వద్ద మాజీ సీఎం జగన్ ఫొటోతో ఇదే విధమైన ప్రచార ఫ్లెక్సీలే ఇంకా దర్శనమిస్తోంది. కూటమి ప్రభుత్వం ఈ ఏడాదిలో సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలు, నూతన రేషన్ కార్డుల పంపిణీ, పింఛన్ల పెంపు తదితర పథకాలను అమలు చేస్తోంది. ఇవేవీ ఈ సచివాలయం వద్ద కానరావడంలేదు. సచివాలయ సిబ్బంది జగన్ హయాంలో తమకు ఉద్యోగం వచ్చిందని ఉద్దేశంతోనే ఈ నవరత్నాల ఫ్లెక్సీలను చెక్కుచెరకుండాకాపాడుతున్నట్టు ప్రజలనుంచి విమర్శలు వినిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి జగన్ ఫొటోలు, నవరత్నాలు తొలగించి ప్రస్తుత కూటమి అమలు చేస్తున్న పథకాలతో కూడిన ప్రచార ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

సీలేరు కాంప్లెక్సు జెన్‌కో సీఈ సీలేరు, డొంకరాయిల్లో పర్యటన



సీలేరులో గుంటవాడ జలాశయంను పరిశీలిస్తున్న ఇంజనీర్లు

సీలేరు, మే 23 , (ఆంధ్రజ్యోతి): ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజనీర్ ఎంవీ స్వామినాయుడు సీలేరు, డొంకరాయిలో విస్తృతంగా పర్యటించారు. సీలేరు కాంప్లెక్సు చీఫ్ ఇంజనీర్‌గా బాధ్యతలను చేపట్టిన ఈయన తొలి సారిగా శుక్రవారం ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా సీలేరు కాంప్లెక్సు సూపరింటెండెంట్ ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఈఈ శ్రీనివాసరెడ్డి లు ఆ యనకు ఘనంగా స్వాగతం పలికారు. డొంకరాయి జలవిద్యుత్ కేంద్రంను, డొంకరాయి పవర్ కెనాల్‌ను పరిశీలించారు. విద్యుత్ ఉత్పత్తి, కెనాల్‌కు సంబంధించిన వివరాలను ఎస్ఈ వివరించారు. అనంతరం సీలేరు చేరుకుని స్థానిక జలవిద్యుత్ కేంద్రంను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇంజనీర్లు, సిబ్బంది ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు.ఈ కేంద్రంలో యూనిట్ల పనితీరు, విద్యుత్ ఉత్పత్తి జరుగుతున్న తీరును విధుల్లో ఉన్న ఇంజనీర్లును అడిగి తెలుసుకున్నారు.అనంతరం స్థానిక రెగ్యులేటర్ డ్యాం, గుంటవాడ జలాశయంను పరిశీలించి నీటి నిల్వల వివరాలను, రెగ్యులేటర్ డ్యామ్ గేట్ల పనితీరుపై స్థానిక సివిల్ అధికారులను ఆరా తీశారు. బలిమెల జలాశయం నుంచిమన వాటాగా ఎంత నీరు తీసుకుంటున్నామని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఈఈ శ్రీనివాసరెడ్డి, ఏడీఈ దుర్గాశ్రీనివాస్, ఏఈ సురేశ్ పాల్గొన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం



గండిబంధ గ్రామంలో గిరిజనులతో మాట్లాడుతున్న జీకేవీధి సీఐ వరప్రసాద్

సీలేరు, మే 23 , (ఆంధ్ర జ్యోతి): జీకేవీధి మండలం మారుమూల గాలికొండ పంచాయతీ పరిధిలోని గండిబంధ గ్రామంలో శుక్రవారం పోలీసుల ఆధ్వర్యంలో చిన్నారులకు మెగా వైద్య శిబిరం నిర్వహించారు. చిన్న పిల్లల వైద్య నిపుణురాలు పద్మావతి, ధారకొండ వైద్యాధికారి హిమబిందు పంచాయతీ పరిధిలోని 200 మంది చిన్నారులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. పెద్దవారికి పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ శిబిరానికి హాజరైన వారికి ఉచితంగా భోజన సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గూడెంకొత్తవీధి సీఐ వరప్రసాద్, సీలేరు ఎస్ఐ రవీంద్ర, జీకేవీధి ఎస్ఐ సూరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మారుమూల గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు: సీఐ

గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలను తీసుకుంటున్నట్టు సీఐ వరప్రసాద్ తెలిపారు. వైద్య శిబిరానికి వచ్చిన వివిధ గ్రామాల గిరిజనులతో సమావేశమై సమస్యలపై ఆరా తీశారు. గ్రామాల్లో రోడ్లు, తాగునీటి సౌకర్యాలు, పాఠశాల భవనాలు, విద్యుత్ , సెల్‌టవర్లు తదితర మౌలిక సౌకర్యాల కల్పనకు ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు, గంజాయి సాగు, రవాణాకు గిరిజనులు దూరంగా ఉండాలని అన్నారు.

టీఏసీ ఏర్పాటు హర్షనీయం

ఆదివాసీ జేఏసీ జిల్లా చైర్మన్ రామారావు దొర



రిలే దీక్ష శిబిరం వద్ద మాట్లాడుతున్న రామారావు దొర

పాడేరురూరల్, మే 23 (ఆంధ్ర జ్యోతి):నిరుద్యోగ యువతకు టీఏసీని ఏర్పాటు చేసినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జేఏసీ జిల్లా చైర్మన్ రామారావు దొర అన్నారు. ఐటీడీఏ ఎదుట నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష శిబిరం వద్ద శుక్రవారం ఆయన మాట్లాడారు. ఆదివాసీ ప్రాంత నిరుద్యోగులకు అన్యాయం జరగకుండా ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ ప్రతినిధులు పోరాటాలు చేస్తూ రాష్ట్రంలోని అన్ని ఐటీడీఏల వద్ద రిలే దీక్షలను చేపట్టడంతో ప్రభుత్వం స్పందించి టీఏసీని ఏర్పాటు చేసిందన్నారు. అయితే, 2025 డీఎస్సీలో ప్రకటించిన ఏజెన్సీ పోస్టులను మినహాయించి ప్రత్యేక నోటిఫికేషన్ ఇవ్వకుంటే ఆదివాసీ నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘనాయకులు బి.సింహాచలం, ఈశ్వరరావు, ఎం.రాజబాబు, కేశవ్, బాకూరు రాజబాబు, సత్యానందం, సత్యనారాయణ, మాధవరావు పాల్గొన్నారు.

'శాయ్'లో వాలీబాల్ శిక్షణకు 2న ఎంపిక

పాడేరురూరల్, మే 23(ఆంధ్రజ్యోతి): స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా రెసిడెన్షియల్ అకాడమీ (శాయ్)లో వాలీబాల్ శిక్షణకు బాల, బాలికల ఎంపికలు జూన్ 2వ తేదీన నిర్వహించనున్నట్టు జిల్లా క్రీడా ప్రాధికారి సంస్థ అధికారి ఎ.జగన్మోహన్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 190 సెంటీమీటర్లు కన్నా ఎక్కువ ఎత్తు కలిగిన 14 నుంచి 16 ఏళ్ల మధ్య వయస్సు గల బాలురు, 16 ఏళ్లు దాటిన బాలురు రెండు కేటగిరీలలో, 170 సెంటీ మీటర్లు కన్నా ఎక్కువ ఎత్తు కలిగిన 14 నుంచి 16 ఏళ్ల మధ్య వయస్సు గల బాలికలు, 16 ఏళ్లు దాటిన బాలికలకు రెండు కేటగిరీలలో ఎంపికలు చేపడతారన్నారు. క్రీడాకారులు వారి ఆధార్ కార్డు, పుట్టిన తేదీ ధృవీకరణ పత్రం, 5 పాస్‌ఫొటోలు, స్పోర్ట్స్ సర్టిఫికెట్లు, మెడికల్ ఫిట్‌నెస్ పత్రాలతో జూన్ 2న విశాఖ అక్కయ్యపాలెంలోని పోర్టు స్టేడియం వద్దకు హాజరు కావాలన్నారు. వివరాలకు 8491607748 సంప్రదించాలన్నారు.

నేలకొరిగిన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్

డుంబ్రిగుడ,మే23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కించుమండలో జల్‌జీవన్ తాగునీటి పథకానికి ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ నేల కొరిగింది. దీంతో నీటి సరఫరాకు విద్యుత్ అంతరాయం నెలకొంది. గురువారం రాత్రి ఆకతాయిలు ట్రాన్స్‌ఫార్మర్‌ను అపహరించేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో స్థానికులను గమనించడంతో పరారైనట్టు గ్రా మస్థులు తెలిపారు. ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

గురుకులాల్లో ఇంటర్ ప్రవేశాలకు 27, 28 తేదీల్లో కౌన్సెలింగ్

పాడేరురూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఐటీడీఏ ఆధ్వర్యంలో నడుపుతున్న గిరిజన గురుకుల కళాశాలల్లో ఇంటర్‌లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న వారికి ఈ నెల 27, 28వ తేదీలలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు ఐటీడీఏ పీవో డాక్టర్ ఎంజే అభిషేక్ గౌడ తెలిపారు. 27న బాలురకు, 28వ తేదీన బాలికలకు పాడేరు ఏపీఆర్ బాలికల కళాశాల ప్రాంగణంలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నామన్నారు. ఒరిజనల్ ధృవపత్రాలతో హాజరుకావాలని ఆయన కోరారు.

జిల్లాలో రాగల ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు

చింతపల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రాగల ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. శుక్రవారం రాగల ఐదు రోజుల వాతావరణ సమాచారాన్ని ప్రకటించారు. ఈనెల 28 తేదీ వరకు చింతపల్లి, పాడేరు, అరకు, రంపచోడవలం డివిజన్ల పరిధిలో కనిష్ఠంగా 8.9మిల్లీమీటర్లు, గరిష్ఠంగా 18మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవుతుందన్నారు.

జోన్‌లో త్వరితగతిన అభివృద్ధి పనులు : ఎస్‌ఈ



ఎస్‌ఈకి సమస్యలు వివరిస్తున్న 84వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి నీలబాబు

అనకాపల్లి టౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ అనకాపల్లి జోన్‌లో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేస్తామని ఎస్‌ఈ కె.శ్రీనివాసరావు తెలిపారు. అనకాపల్లి, పెందుర్తి జోన్‌లకు ఎస్‌ఈగా నియమితులైన ఆయన శుక్రవారం ఇక్కడికి విచ్చేసిన సందర్భంగా మాట్లాడారు. పనుల పూర్తికి అందరి సహకారం తీసుకుంటామన్నారు. అనంతరం 84వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి మాదంశెట్టి నీలబాబు ఎస్‌ఈతో అభివృద్ధి పనులపై చర్చించారు. కొత్తగా రూ.4.72 కోట్లతో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు తయారు చేయించి జీవీఎంసీ ఉన్నతాధికారులకు ఇవ్వడం జరిగిందని ఎస్‌ఈ తెలిపారు. ఈ నిధులతో 84వ వార్డు పరిధిలో సిరసపల్లి, కొత్తూరు, కొప్పాక, అనకాపల్లి పట్టణంలోని లక్ష్మీనారాయణనగర్, కోట్నీవీధి తదితర ప్రాంతాల్లో డ్రైన్లు, సీసీ రోడ్లు, ఓపెన్ జిమ్ పనులు చేపడతామన్నారు. గతంలో గొల్లవీధి నుంచి లక్ష్మీనారాయణనగర్ మీదుగా డ్రైనేజీ పనులకు సంబంధించి నిధులు మంజూరై టెండర్లు పిలిచినా పనులు చేపట్టలేదని, ప్రస్తుతం ఆ పనులకు అంచనాలు రివైజ్ చేసి పూర్తి చేయాలని నీలబాబు కోరారు. అలాగే లక్ష్మీనారాయణనగర్‌లోని స్కేటింగ్ పార్కు అభివృది, ఆ మార్గంలో వీధి దీపాలు ఏర్పాటు, డ్రైనేజీ ఔట్‌లెట్ సౌకర్యం కల్పన, రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి కార్పొరేటర్ లేఖ ద్వారా ఇవ్వడం జరిగిందని, ఆ పనులు కూడా త్వరతగతిన పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈఈ ఎస్. శేఖర్, డీఈ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ఆర్టీసీలో 1/2019 సర్క్యులర్ అమలుపై హర్షం



ఆర్టీసీ డిపో గేటు వద్ద సమావేశంలో పాల్గొన్న సుధాకర్, తదితరులు

అనకాపల్లి టౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ యాజమాన్యం 1/2019 సర్క్యులర్‌ను రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని డిపోల్లో అమలు చేయాలని నిర్ణయించినందుకు ఎన్‌ఎంయూఏ రీజనల్ కార్యదర్శి పి.సుధాకర్ కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడి ఆర్టీసీ డిపో గేటు వద్ద శుక్రవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. యూనియన్ రాష్ట్ర నాయకత్వం చేసిన సుదీర్ఘ పోరాటం వల్ల సంస్థ ప్రధాన కార్యాలయంలో ఈడీలతో పలుమార్లు సమస్యలపై చర్చించి పరిష్కరించడమే కాకుండా 1/2019 సర్క్యులర్ అన్ని డిపోల్లో అమలు చేయాలని పేర్కొనడం శుభ పరిణామంగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి, రవాణా శాఖ మంత్రి, యాజమాన్యానికి, యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులకు కృతజ్ఞతలు తెలిపారు. అయితే సర్క్యులర్ అమలు పట్ల అనకాపల్లి అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎల్వీఆర్ బాబు, వేపాడ శ్రీను, ఏఎన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'ఆర్‌ఈసీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో అడ్మిషన్లు'



విద్యార్థి నుంచి దరఖాస్తు స్వీకరిస్తున్న సంస్థ ఎండీ ప్రసాద్

కశింకోట, మే 23 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి రాజీవ్ గాంధీ ఆర్‌ఈసీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో సంస్థ ఉద్యోగులు, వినియోగదారుల పిల్లలకు కేటాయించిన యాభై శాతం సీట్ల అడ్మిషన్లకు సంబంధించి దరఖాస్తుల విక్రయం శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జి.ప్రసాద్ మాట్లాడుతూ అనకాపల్లి, కశింకోట, మునగపాక, సబ్బవరం, పరవాడ మండలాలకు చెందిన వినియోగదారుల పిల్లలకు కేటాయించిన సీట్లకు సంబంధించి ఈ అడ్మిషన్లను ప్రారంభించామన్నారు. అర్హులు కళాశాల పనివేళల్లో దరఖాస్తులు పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ బి.ఉమాశంకర్, అసోసియేట్ ప్రిన్సిపాల్ కర్రి శివ, విభాగాధిపతి గణేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

'అధ్వాన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి'



సమావేశంలో మాట్లాడుతున్న వియ్యపు రాజు

తుమ్మపాల, మే 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా అధ్వానంగా ఉన్న రోడ్లకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు వియ్యపు రాజు కోరారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు రోడ్ల దుస్థితిపై ఆందోళనలు చేపట్టిన కూటమి నాయకులు, వీరు అధికారంలోకి వచ్చిన తరువాత విస్మరించడం తగదన్నారు. పలుచోట్ల రోడ్లు అస్తవ్యస్తంగా మారడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. ఈ సమావేశంలో నాయకులు కోరిబిల్లి శంకర్రావు, విత్తనాల పోతురాజు, ఎం.సూరిబాబు, పి.వెంకటేష్, సురేష్ పాల్గొన్నారు.

పరిసరాలను మరింత శుభ్రంగా తీర్చిదిద్దండి



కార్మికులకు కొబ్బరినూనె, సబ్బులు అందిస్తున్న కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్

పరవాడ, మే 23 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 79వ వార్డు పరిధి దేశపాత్రునిపాలెం, సాయినగర్ కాలనీలో పారిశుధ్య పనులు చేపడుతున్న కార్మికులకు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ కొబ్బరినూనె, పదిచొప్పున సబ్బులను శుక్రవారం పంపిణీ చేశారు. వార్డులో పరిసరాల పరిశుభ్రతకు మరింత కృషిచేయాలన్నారు. శానిటరీ, సచివాలయ, మలేరియా సిబ్బందితో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

తూర్పు కాపు విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తులు

కొత్తూరు, మే 23 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది జరిగిన పదో తరగతి పరీక్షల్లో 500 మార్కులకు పైగా సాధించిన తూర్పు కాపు విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తూర్పు కాపు సంఘం మండల అధ్యక్షుడు పోలిన సూర్య జగ్గారావు శుక్రవారం తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు తమ హాల్‌టికెట్, కుల, ఎస్ఎస్‌సీ మార్కుల జాబితా పంపించాలన్నారు. అర్హులంతా 98666 87859, 99898 89442 నంబర్ల ద్వారా రిజిస్ట్రేషన్ కావాలని సూచించారు.

మూలపేటలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం

- రెండు నెలల క్రితం ఈగల వారి వీధిలో కాలువల తవ్వకాలు ప్రారంభించి అర్ధంతరంగా నిలిపివేత
- నాటి నుంచి పట్టించుకోని అధికారులు
- గోతుల్లో పడి పలువురు చిన్నారులకు గాయాలు
- వర్షాలు కురిసే సమయాల్లో ఆ నీరుతో పాటు మురుగు చేరుతుండడంతో దుర్వాసన



ఈగలవారి వీధిలో కాలువ నిర్మాణానికి తీసిన గొయ్యి

కొత్తూరు, మే 23 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం సత్యనారాయణపురం పంచాయతీ పరిధి మూలపేటలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ఇక్కడున్న ఈగల వారి వీధిలో మురుగు కాలువల నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయాయి. రెండు నెలల క్రితం కాలువల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. కానీ పనులను మధ్యలోనే నిలిపివేశారు. దీంతో కాలువల నిర్మాణానికి తీసిన గోతుల్లో చిన్నారులు పడి గాయాలకు గురవుతున్నారని అక్కడివారు వాపోతున్నారు. అంతేకాకుండా వర్షం వస్తే గోతుల్లో మురుగుతో పాటు వర్షంపు నీరు చేరి మరింత ప్రమాదకరంగా మారుతున్నాయని అం టున్నారు. దీనిపై పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామాభివృద్ధి కమిటీ కన్వీనర్ కోన లక్ష్మణ ఆరోపించారు. తక్షణమే సమస్య పరిష్కరించుకుంటే ఆం దోళన చేపడతామని గ్రామానికి చెందిన ముత్యాలమ్మ, రమణ, ఈగల అరుణ తదితరులు హెచ్చరించారు.

గొర్లెవానిపాలెం వద్ద రహదారిపైనే వాడుకనీరు



పరవాడ మండలం గాజువాక- ఎలమంచిలి ప్రధాన మార్గంలోని గొర్లెవానిపాలెం వద్ద రహదారిపైకి చేరిన వాడుకనీరు



కాలువ తవ్వకాలు అర్ధంతరంగా నిలిచిపోవడంతో ఇలా..

పరవాడ: ఇక్కడి గాజువాక- ఎలమంచిలి ప్రధాన మార్గంలోని గొర్లెవానిపాలెం వద్ద రహదారిపై మురుగు తిష్ఠ వేస్తోంది. రహదారికి ఆనుకొని నివాసం ఉంటున్న వారిలో కొందరు వాడుకనీరు బయటకు విడిచిపెట్టడంతో ఆ నీరంతా రహదారి పైనే పారుతోంది. గత కొంతకాలంగా ఇక్కడ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. రోజుల తరబడి మురుగు నిల్వ ఉండిపోవడంతో దుర్గంధం వెదజల్లడంతో పాటు ఈగలు, దోమలు వృద్ధిచెంది కంటిపై కునుకు లేకుండా పోతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కారణంగా తరుచూ రోగాల బారిన పడుతున్నామని చెబుతున్నారు. ఇక్కడి సమస్యపై అధికారులు వెంటనే స్పందించాల్సిందిగా అంతా కోరుతున్నారు.

త్వరితగతిన నూకాంబిక దేవస్థానం పునర్నిర్మాణ పనులు

- అధికారులకు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆదేశం
- పనులు పరిశీలించి సూచనలు



ఆలయంలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొణతాల

అనకాపల్లి టౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత అనకాపల్లి నూకాంబిక దేవస్థానంలో జరుగుతున్న ఆలయ పునర్నిర్మాణ పనులను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా దేవదాయ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించి ఆలయంలో చేపడుతున్న, చేపట్టాల్సిన పనులపై చర్చించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. దేవాలయం లోపల జరుగుతున్న పనులను పరిశీలించి భక్తులకు అనువుగా ఉండే విధంగా కొన్ని సూచనలు చేశారు. ఆలయ ప్రాంతమంతా సుందరంగా తీర్చిదిద్దాలని, ఏసీలు, విద్యుద్దీపాలు విరివిగా ఏర్పాటు చేయాలని తెలిపారు. దేవాలయ ప్రాంగణంలో ఇకపై చేపట్టే అభివృద్ధి పనులను మాస్టర్ ప్లాన్ ప్రకారం చేయాలని సూచించారు. దేవాలయానికి అవసరమైన భూములు కొనుగోలుకు సంబంధిత యాజమానులతో సంప్రదించాలన్నారు. ఆలయ ఈవో వి.రాంబాబు, దేవదాయ శాఖ డీఈఈ కృష్ణ, ఉప స్థపతి శ్రీనివాసాచార్యులు, ఏఈ శివప్రసాద్, జిల్లా సహాయ కమిషనర్ సుధారాణి, ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ పీలా నాగశ్రీను, సభ్యులు, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి

- ప్రజా దర్బార్‌లో అధికారులకు ఎమ్మెల్యే 'పంచకర్ల' సూచన



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

పరవాడ, మే 23 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు స్పష్టం చేశారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాట్లాడారు. చిన్నపాటి సమస్యలన్నింటినీ ఇక్కడే పరిష్కరిస్తామన్నారు. ఒక వేళ సమస్య జటిలమైతే రాజధాని స్థాయికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. అధికారులు కూడా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మొత్తం 105 అర్జీలకు గాను 40 సమస్యలను ఇక్కడే పరిష్కరించామని ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి.రమేశ్‌నాయుడు, డిప్యూటీ తహసీల్దార్ సురేశ్‌నాయుడు, పంచాయతీ విస్తరణాధికారి కె.ధర్మారావు, మాజీ ఎంపీపీలు పైలా జగన్నాథరావు, మానవరపు అప్పలనాయుడు, పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతకాయల ముత్యాలు, అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, మండలంలోని రావాడ పంచాయతీకి స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా మంజూరైన ట్రాక్టర్, పంచాయతీ నిధులతో సమకూర్చిన ట్రక్కు, వాటర్ ట్యాంకర్‌ను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు, పంచాయతీ కార్యదర్శి అనురాధ, కూటమి నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



చీకటి పువ్వు నాటికలో ఓ సన్నివేశం



'నాన్నా నేనొచ్చేస్తా'లో..

ఆహూతులను కట్టిపడేసిన ఆహ్వాన నాటిక పోటీలు

- అద్భుత నటనతో ప్రశంసలు అందుకున్న కళాకారులు



మహాప్రస్థానం నాటికలో అద్భుత ఘట్టం

కశింకోట, మే 23 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కశింకోట గవరపేట వీధిలో జరుగుతున్న తెలుగు రాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు రెండో రోజుకు చేరుకున్నాయి. అశోక్ ఫ్రెండ్స్ క్లబ్ సాంస్కృతిక కళా పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ పోటీల్లో శుక్రవారం రాత్రి మూడు నాటికలను ప్రదర్శించారు. ముందుగా కరీంనగర్ చైతన్య కళాభారతి బృందం 'చీకటి పువ్వు' నాటికను ప్రదర్శించారు. తరువాత గుంటూరు శ్రీఅమృత లహరి థియేటర్ ఆర్ట్స్ వారు 'నాన్నా నేనొచ్చేస్తా' నాటికను ప్రదర్శించారు. అలాగే విజయవాడ గురజాడ కళామందిర్‌కు చెందిన కళాకారులు మహా ప్రస్థానం నాటికను అద్భుంగా ప్రదర్శించారు.

ఆకట్టుకున్న 'చీకటి పువ్వు'

పరిస్థితులకు ఏ మనిషి అతీతం కాదు. అవసరంతోనో, అవకాశం లేకనో చాలా మంది జీవితంలో తప్పులు చెయ్యడం సహజం. కానీ చేసిన తప్పులు తెలుసుకొని పశ్చాత్తపడిన తర్వాత కూడా దూరం పెట్టకండి. క్షమించి వాళ్లని దగ్గరికి తీసుకోండి. ప్రాణం పోయిన తర్వాత బాధపడేకంటే ఉన్నప్పుడే బాధ్యతగా వ్యవహరించండి. క్షమించడంలోనే నిజమైన ప్రేముందని తెలియజెప్పేదే నాటిక సారాంశం. రమేష్ దర్శకత్వంలో మూలకథ పి.ఎస్.నారాయణ రచించారు. గుడివాడ లహరి, కొత్తకొండ సత్యనారాయణ, రమేష్ మం చాల, సూర్య, ఏపూరి శ్రీనివాస్ చక్కని ప్రాతలను పోషించారు. సంగీతం సురభి నాగరాజు అందించారు. ఆహార్యం, రంగాలంకరణ, లైటింగ్ కె.నాగు వ్యవహరించారు.

కట్టిపడేసిన 'నాన్నా నేనొచ్చేస్తా'

నేటి సమాజంలో తల్లిదండ్రులు తమ పిల్లలకు చదువు నుంచి పెళ్లి వరకూ పిల్లలు అడిగిందల్లా కాదనకుండా ఇస్తున్నారు. మితిమీరిన వాత్సల్యం, మమకారాన్ని పెంచుకొని, పోనీలే మన పిల్లలేగా అని స్వేచ్ఛనిచ్చి పెంచితే దాని ఫలితం పెళ్లైన కొంతకాలానికే వైవాహిక జీవితంలో భార్యాభర్తల మధ్య వచ్చిన మనస్పర్థలను పరిష్కరించుకోలేకపోతున్నారు. పెళ్లంటే సర్దుబాటు. సంసారం అంటే దిద్దుబాటు అన్న సూత్రాన్ని అర్థం చేసుకోలేకపోతున్నారు. మెట్టినింటి నుంచి పుట్టినింటికి 'నాన్నా నేనొచ్చేస్తా' అంటూ ప్రయాణం చేస్తున్న సుధలాంటి అమ్మాయికి, భర్త శ్రీరామ్‌కి, తల్లిదండ్రులు రాఘవ, సావిత్రిల మధ్య జరిగిన సంఘర్షణలకు దృశ్యరూపమే ఈ నాటిక. పెళ్లైన కూతరు నాన్నా- నేనొచ్చేస్తా అన్నమాటకు స్వస్తి పలికి, నాన్నా- మీరు మాఇంటికి ఎప్పుడు వస్తారని ఆహ్వానం పలికే రోజులు రావాలి. అప్పుడే పవిత్రమైన భార్యాభర్తల బంధం బలపడి, వైవాహిక జీవితం నిత్య నూతనమై శతవసంతాలు వర్ధిల్లుతుందనే సందేశమిచ్చేదే ఈ నాటిక కథాంశం. ఈ నాటికను గుంటూరు శ్రీఅమృత లహరి థియేటర్ ఆర్ట్స్ వారు అత్యద్భుతంగా ప్రదర్శించారు. దీనికి మూలకథ గంటి రాజేశ్వరి వ్యవహరించగా, తాళాబత్తుల వెంకటరరావు రచన చేశారు.

ఆలోచింపజేసిన 'మహాప్రస్థానం'

పేదరికాన్ని అధిగమించాలని ఆలోచన, అవగాహన లేని ప్రయాణం చేయడమే మహాప్రస్థానం అన్న కథాంశంతో కళాకారులు ప్రదర్శించిన మహాప్రస్థానం నాటిక ఆహూతులను విశేషంగా ఆకట్టుకుంది. విజయవాడ గురజాడ కళామందిర్ వారు ప్రదర్శించిన ఈ నాటికలో బొర్రా నరేష్, ఎల్.ఎస్.ఆర్.కె.ప్రసాద్, రమేష్ బాబు, పిళ్లా నటరాజ్, ఆర్.రాజేశ్వరి అద్భుతంగా పాత్రలను పోషించారు. ఈ కార్యక్రమంలో కళా పరిషత్ అధ్యక్షుడు బొడ్డేడ బలరామస్వామి, ప్రధాన కార్యదర్శి మారిశెట్టి వెంకటదేవినాయుడు, సభ్యులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతునికి త్రిచక్ర వాహనం అందజేత



వాహనం తాళం అందిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, మే 23 (ఆంధ్రజ్యోతి) : రావికమతం మండలం రోచుపణుకు గ్రామానికి చెందిన విభిన్న ప్రతిభావంతుడు తూర్రి రవికి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ శుక్రవారం ఇక్కడ త్రిచక్ర వాహనాన్ని అందజేశారు. కలెక్టర్ వినతి మేరకు అచ్యుతాపురం సెజ్‌లో గల టొయోటా రేర్ ఎర్త్ కంపెనీ సీఎస్ఆర్ నిధులతో దీనిని సమకూర్చింది. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ సుధాకర్, కంపెనీ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ మురళీధర్ పాల్గొన్నారు.

సీఐ అశోక్‌కుమార్‌కు ఎస్పీ ప్రశంస



ఎస్పీ తుహిన్ సిన్హా నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న సీఐ అశోక్‌కుమార్

కొత్తూరు, మే 23 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన పలు దొంగతనాల కేసుల్లో అంతర్రాష్ట్ర ముఠాను అరెస్టు చేయడంలో కీలకపాత్ర పోషించిన సీఐ అశోక్‌కుమార్‌ను జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అభినందించారు. ఈ మేరకు శుక్రవారం ఇక్కడ జరిగిన సమావేశంలో సీఐకి ప్రశంసా పత్రాన్ని అందజేసి అభినందించారు.

ఐదుగురు పీఎస్‌లు విధుల్లో చేరిక

సబ్బవరం, మే 23 (ఆంధ్రజ్యోతి) : సాధారణ బదిలీల్లో భాగంగా వివిధ పోలీసు స్టేషన్ల నుంచి వచ్చిన నలుగురు కానిస్టేబుళ్లు, ఒక హెడ్ కానిస్టేబుల్ శుక్రవారం సబ్బవరం పోలీస్ స్టేషన్‌లో విధుల్లో చేరారని సీఐ జి.రామచంద్రరావు తెలిపారు. ఇక్కడి నుంచి 12 మంది సిబ్బంది బదిలీపై వివిధ స్టేషన్లకు వెళ్లారన్నారు. వారి స్థానాల్లో ప్రస్తుతం ఐదుగురు చేరారని, ఇంకా ఏడుగురు పీసీలు రావలసి ఉందని వివరించారు.

నేడు యోగాపై అవగాహన సదస్సు

సబ్బవరం, మే 23 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఉదయం పది గంటలకు ఇక్కడి ప్రభుత్వ డిగ్రీ కళా శాలలో యోగాపై అవగాహన సదస్సు నిర్వహించనున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్21 వరకూ యోగాసనాలతో పాటు యోగా శాస్త్రంపై విద్యార్థులకు, ఆసక్తిగల వారికి అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.

గుర్తు తెలియని మానసిక రోగిని ఆసుపత్రిలో చేర్చిన పోలీసులు



చికిత్స పొందుతున్న వ్యక్తి

కశింకోట, మే 23 (ఆంధ్రజోతి) :గుర్తు తెలియని మానసిక రోగిని అనకాపల్లి ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్చి కశింకోట పోలీసులు మానవత్వం చాటుకున్నారు. ఇందుకు సంబంధించి సీఐ అల్లు స్వామినాయుడు, ఎస్ఐ లక్ష్మణరావు తెలిపిన వివరాలివి. తాళ్లపాలెం గ్రామ సమీపంలో అలకనంద లే అవుట్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి స్పృహ కోల్పోయి పడి ఉన్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ సిబ్బందితో అక్కడికి చేరుకుని అతనిని 108 వాహనం ద్వారా ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు.

రోడ్డు వేశారు.. కల్వర్టులు వదిలేశారు!

ఆరిలోవ అటవీ ప్రాంతంలో అసంపూర్తిగా రహదారి విస్తరణ

- గత ప్రభుత్వ హయాంలో పనులు చేపట్టిన కాంట్రాక్టర్
- బిల్లులు మంజూరు కాకపోవడంతో పనులు నిలుపుదల
- కల్వర్టులు నిర్మించాల్సిన ప్రదేశాల్లో గోతులమయంగా రహదారి
- వర్షం కురిస్తే ఇబ్బంది పడుతున్న వాహనదారులు




ఆరిలోవ అటవీ ప్రాంతంలో కల్వర్టులు నిర్మించాల్సిన ప్రదేశంలో విస్తరణకు నోచుకోని రోడ్డు

గొలుగొండ, మే 23 (ఆంధ్రజ్యోతి):

నర్సీపట్నం- కృష్ణాదేవిపేట ప్రధాన రహదారిలో గొలుగొండ మండలంలోని ఆరిలోవ అటవీ ప్రాంతంలో రోడ్డు విస్తరణ పనులను ఆర్‌అండ్‌బీ అధికారులు అసంపూర్తిగా వదిలేశారు. లోతట్టు ప్రదేశాల వద్ద వర్షం నీరు రోడ్డు మీదుగా ప్రవహించకుండా పలుచోట్ల కల్వర్టులు నిర్మించడానికి ఆయా ప్రదేశాల వద్ద రహదారిని విస్తరించలేదు. మిగిలిన రోడ్డు పనులు పూర్తి చాలా నెలలు అవుతున్నప్పటికీ కల్వర్టులు మాత్రం నిర్మించలేదు. ఆయా ప్రదేశాల వద్ద కనీసం గోతులు అయినా పూడ్చలేదు. దీంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. వర్షం కురిస్తే బురదమయమై పరిస్థితి మరింత అధ్వానంగా తయారవుతున్నది.

నర్సీపట్నం నుంచి కృష్ణాదేవిపేట వరకు గత టీడీపీ హయాంలో అప్పటి ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి, ప్రస్తుతం అసెంబ్లీ స్పీకర్‌గా వున్న సిహెచ్.అయ్యన్నపాత్రుడు నిధులు మంజూరు చేయించి రహదారిని విస్తరింపజేశారు. అయితే గొలుగొండ మండల పరిధిలో సుమారు నాలుగు కిలోమీటర్ల మేర ఆరిలోవ అటవీ ప్రాంతం వుంది. అప్పట్లో రోడ్డు విస్తరణకు అటవీ శాఖ అధికారులు అనుమతులు ఇవ్వలేదు. దీంతో ఈ నాలుగు కిలోమీటర్ల మినహా మిగిలిన ప్రాంతంలో రోడ్డు విస్తరణ చేపట్టారు. అటవీ శాఖ నుంచి క్లియరెన్స్ వచ్చేలోగా రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చింది. కానీ నాలుగేళ్లపాటు రోడ్డు విస్తరణ పనులు చేయలేదు. ఎట్టకేలకు 2023లో అటవీ ప్రాంతంలో నాలుగు కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ, నాలుగుచోట్ల కల్వర్టుల నిర్మాణానికి రూ.4.5 కోట్లు మంజూరయ్యాయి. అధికారులు టెండర్ల ప్రక్రియ పూర్తిచేసిన తరువాత కాంట్రాక్టర్ పనులు మొదలుపెట్టారు. వాస్తవంగా తొలుత కల్వర్టులు నిర్మించి, పిమ్మట రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి. కానీ కల్వర్టుల పనులు మొదలుపెట్టకుండా, మిగిలినచోట్ల రోడ్డు విస్తరణ పనులు



విస్తరణ జరగని ప్రదేశంలో వర్షాలకు బురదమయంగా మారిన రోడ్డు

మొదలుపెట్టారు. చేసిన పనులకు దశలవారీగా బిల్లులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. 2023 చివరలో రూ.90 లక్షల బిల్లు మాత్రమే క్లియర్ అయ్యింది. అప్పటికి సుమారు రూ.3 కోట్ల విలువైన పనులు పూర్తిచేసినట్టు కాంట్రాక్టర్ చెబుతున్నారు. తరువాత బిల్లులు మంజూరుకాకపోవడం, ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. ఎన్నికల తరువాత కాంట్రాక్టర్ పనులు పునరుద్ధరించలేదు. ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయలేదు. కల్వర్టులు నిర్మించాల్సిన చోట రహదారి మొత్తం గోతులమయంగా వుంది. ఇటీవల అధికారులు గ్రావెల్‌తో గోతులు కప్పారు. కొద్ది రోజుల నుంచి వర్షాలు కురుస్తుండడంతో కల్వర్టులు నిర్మించాల్సిన ప్రదేశాల వద్ద గోతుల్లో వేసిన గ్రావెల్ నీటితోపాటు కొట్టుకుపోయి బురదగా తయారైంది. దీంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అధికారులు స్పందించి కల్వర్టులు నిర్మించేలా కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తీసుకురావాలని ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగించే పలు గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆరిలోవ అటవీ ప్రాంతంలో కల్వర్టులు నిర్మించకపోవడంపై ఆర్‌అండ్‌బీ జేఈ ప్రసాద్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. గత ప్రభుత్వంలో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులకు బిల్లులు రాలేదని చెప్పారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, త్వరలో పనులు చేపట్టే అవకాశం వుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

నేడు 20 సూత్రాల కార్యక్రమం అమలుపై సమీక్ష

అనకాపల్లి కలెక్టరేట్, మే 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ పథకాలు, ప్రాజెక్టులు, 20 సూత్రాల కార్యక్రమం అమలు తీరుపై చైర్మన్ లంక దినకర్ శనివారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించనున్నట్టు కలెక్టర్ విజయకృష్ణన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పదిన్నర గంటలకు ప్రారంభం అయ్యే ఈ సమావేశానికి సంబంధిత శాఖల అధికారులంతా తప్పక హాజరుకావాలని ఆమె స్పష్టం చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ, జల్ జీవన్ మిషన్, పీఎం గ్రామీణ సడక్ యోజన, టిడ్కో గృహాలు, అమృత్ తదితర కార్యక్రమాలు, పథకాలపై ఆయన సమీక్ష నిర్వహిస్తారని పేర్కొన్నారు.

4న ఎలమంచిలిలో ఉమ్మడి రాష్ట్రస్థాయి పాటల పోటీలు

ఎలమంచిలి, మే 23 : (ఆంధ్రజ్యోతి): గాన గంధర్వుడు డాక్టర్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 79వ జయంతి సందర్భంగా వచ్చే నెల 4వ తేదీన ఎలమంచిలిలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి పాటల పోటీలు నిర్వహించనున్నట్టు కార్యనిర్వాహక కమిటీ చైర్మన్ మత్స్యర్తి రామారావు శుక్రవారం తెలిపారు. పట్టణంలోని గురవప్ప కల్యాణ మండపంలో ఉదయం ఎనిమిది గంటలకు మహిళలు, పురుషులకు సోలో, డ్యూయట్ పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.4 వేలు, ద్వితీయ బహుమతి రూ.3 వేలు, తృతీయ బహుమతి రూ.2 వేలు, కన్సొలేషన్ బహుమతి రూ.1,000 నగదుతోపాటు జ్ఞాపికలను అందజేస్తామని, ఎంట్రీ ఫీజు రూ.100 చెల్లించాల్సి వుంటుందని పేర్కొన్నారు. పేర్ల నమోదు కోసం యల్లపు పైడికొండ- 76759 09588, కిర్లంపల్లి మల్లీశ్వరరావు- 95533 68503, మత్స్యర్తి రామారావు- 81848 03083 నబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని ఆయన కోరారు.

గంజాయి నేరస్థుల ఆస్తులు జప్తు

- ముమ్మరంగా రాత్రిపూట గస్తీలు
- అనుమానిత వ్యక్తుల వేలి ముద్రలను పరీక్షించండి
- సమీక్షా సమావేశంలో ఎస్పీ తుహిన్‌సిన్హా ఆదేశం



సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణాకు పాల్పడుతున్న వారి ఆస్తుల జప్తునకు చర్యలు తీసుకోవాలని ఎస్పీ తుహిన్‌సిన్హా ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన నెలవారీ సమీక్షా సమావేశంలో తొలుత స్టేషన్ల వారీగా కేసుల పురోగతిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తుల వేలి ముద్రలను ఐడెంటిఫికేషన్ డివైజ్ ద్వారా తనిఖీ చేయాలని సూచించారు. రాత్రి గస్తీ ముమ్మరం చేయాలని, విజిబుల్ పోలీసింగ్ విస్తృతంగా నిర్వహించాలన్నారు. డయల్ 112 కాల్స్‌కు త్వరగా స్పందించడానికి శిక్షణతో కూడిన టీములు సంఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు భరోసా కల్పించాలన్నారు. డ్రగ్స్‌కు బానిసలైన వారిని డీ-అడిక్షన్ సెంటర్లలో చేర్పించేందుకు వారితోపాటు కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలని సూచించారు. ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో యాక్టు, మహిళా చట్టాలు, నేరాలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించాలన్నారు. గ్రామాలను సందర్శిస్తూ నేర ప్రవర్తనగల వ్యక్తుల స్థితిగతుల గురించి ఆరా తీయాలని ఎస్పీ చెప్పారు. ఈ సందర్భంగా ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో ప్రతిభ కనబరిచిన ఏఎస్పీ మోహన్‌రావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు జీఎస్‌ఎన్‌వీ ప్రసాదరావు, కె.జగదీశ్వరరావు తదితరులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సమావేశంలో అనకాపల్లి ఇన్‌చార్జి డీఎస్పీ బి.మోహన్‌రావు, నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- విజయవాడ రైల్వే డివిజన్ సీనియర్ డీసీఎం రాంబాబు
- అనకాపల్లి స్టేషన్‌లో పలు అభివృద్ధి పనులు పరిశీలన



అభివృద్ధి పనుల గురించి ఆరా తీస్తున్న దక్షిణ మధ్య రైల్వే విజయవాడ సీనియర్ డీసీఎం రాంబాబు

అనకాపల్లి టౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి):

అమృత్ భారత్ కార్యక్రమంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగంగా పూర్తిచేయాలని దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ సీనియర్ డీసీఎం వి.రాంబాబు స్థానిక అధికారులను ఆదేశించారు. ఆయన శుక్రవారం అనకాపల్లి రైల్వేస్టేషన్‌ను తనిఖీ చేసి వివిధ దశల్లో వున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఒకటి, రెండు, మూడు ప్లాట్‌ఫారాలను కలియతిరిగారు. వాహనాల నిలుపుదల ప్రదేశాన్ని పరిశీలించి స్థానిక అధికారులకు పలు సూచనలు చేశారు. గూడ్స్‌షెడ్డు వైపు లిఫ్ట్ ఉన్న విషయం ప్రయాణికులకు తెలిసేలా బోర్డులు ఏర్పాటు చేయాలని, ప్రయాణికులు వేచివుండే హాళ్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా వుంచాలని చెప్పారు. గూడ్స్ షెడ్డు వైపు కూడా ఎస్కలేటర్ ఏర్పాటు చేసే అవకాశముందని అన్నారు. గూడ్స్‌షెడ్డు వైపు ఉన్న రెండో టికెట్ కౌంటర్ ప్రదేశంలో పార్శిల్ బుకింగ్ కౌంటర్ కూడా అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. గూడ్స్‌షెడ్డు వైపు రైల్వే ట్రాక్ మీదుగా ప్రయాణికులు రాకపోకలు సాగించకుండా చూడాలని, కాలినడక వంతెన మీదుగా ప్లాట్‌ఫారాలకు చేరేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆయన వెంట స్టేషన్ మేనేజర్ సచ్చినివాస్, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ నవీన్, ఇతర అధికారులు ఉన్నారు.



ఎలమంచిలి రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనుల పురోగతి గురించి తెలుసుకుంటున్న సీనియర్ డీసీఎం రాంబాబు

ఎలమంచిలి రైల్వే స్టేషన్‌ను సందర్శించిన సీనియర్ డీసీఎం

ఎలమంచిలి, మే 23 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి రైల్వే స్టేషన్‌ను శుక్రవారం సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ వి.రాంబాబు సందర్శించారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా జరుగుతున్న ఆధునికీకరణ పనులను పరిశీలించారు. ప్రయాణికుల సౌకర్యార్థ చేపడుతున్న పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి, షెడ్ల నిర్మాణం, ప్రయాణికులు వేచి ఉండే గదులు తదితరాల పనులపై ఆరా తీసి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు రైల్వే అధికారులతో పాటు ఎలమంచిలి స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

అనకాపల్లిలో గంటకుపైగా ఆగిన బొకారో ఎక్స్‌ప్రెస్

- ఉక్కపోతతో ఇబ్బంది పడిన సాధారణ బోగీల ప్రయాణికులు



అనకాపల్లి స్టేషన్‌లో నిలిచిన బొకారో ఎక్స్‌ప్రెస్

అనకాపల్లి టౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి): ధన్‌బాద్-అలెప్పీ (నంబర్ 13351) బొకారో ఎక్స్‌ప్రెస్ శుక్రవారం స్థానిక రైల్వే స్టేషన్‌లో గంటకుపైగా నిలిచిపోయింది. కారణం ఏమిటో రైల్వే సిబ్బంది ఎవరూ చెప్పకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. షెడ్యూల్ ప్రకారం బొకారో ఎక్స్‌ప్రెస్ ఉదయం 9.24 గంటలకు రావాలి. ఇక్కడ నిమిషంపాటు మాత్రమే హాల్ట్ వుంది. కానీ శుక్రవారం ఉదయం 10.05 గంటలకు అనకాపల్లి స్టేషన్‌కు చేరింది. నిమిషం తరువాత గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలి. ఎంతసేపటికీ సిగ్నల్ ఇవ్వకపోవడంతో రైలు కదలలేదు. ఏం జరిగిందో తెలియక ప్రయాణికులు ఆయోమయానికి గురయ్యారు. రైలును ఎందుకు ఆపాల్సి వచ్చిందో అధికారులు ఎటువంటి అనౌన్స్‌మెంట్ (ప్రకటన) చేయలేదు. ఉక్కపోత కారణంగా సెకండ్ క్లాస్ స్లీపర్, సాధారణ బోగీల్లో వున్న ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. కొంతమంది ప్రయాణికులు బోగీల్లో నుంచి బయటకు వచ్చి రైల్వే అధికారులను వాకబు చేశారు. నర్సింగబిల్లి వద్ద ట్రాక్ నిర్వహణ పనులు జరుగుతున్నందున రైలును అనకాపల్లిలో ఆపాల్సి వచ్చిందని వారు తెలిపారు. సుమారు గంట తరువాత రైలు విజయవాడ వైపు బయలుదేరింది.

పేదోడి కడుపు నింపడమే ప్రభుత్వ లక్ష్యం

- మూడు నెలల్లో అందుబాటులోకి అన్న క్యాంటీన్
- ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి



అన్న క్యాంటీన్ భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

మాడుగుల, మే 23 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల ఆకలి తీర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. శుక్రవారం మాడుగుల దుర్గాలమ్మ ఆలయ సమీపంలో అన్న క్యాంటీన్ భవన నిర్మాణ పనులకు ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మాడుగులలో అన్న క్యాంటీన్‌ను మూడు నెలల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వైద్యం కోసం ఆస్పత్రికి, ప్రభుత్వ కార్యాలయాలకు, బ్యాంకు, వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చే పేదవారికి ఐదు రూపాయలకే టిఫిన్, భోజన సదుపాయం అందిస్తామన్నారు. ఈ భవన నిర్మాణానికి రూ.65లక్షలు మంజూరయ్యాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో అన్న క్యాంటీన్‌లు ఎత్తివేసి ఎంతోమంది పేద, మధ్య తరగతి శ్రామికుల కడుపులు అర్ధాకలితో ఉండేలా చేశారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్న క్యాంటీన్‌లను పునరుద్ధరణ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పుప్పాల అప్పల రాజు, టీడీపీ మండల అధ్యక్షుడు అద్దెపల్లి జగ్గారావు, ఎంపీపీ తాళ్లపురెడ్డి రాజాం, సర్పంచ్ యడ్ల కళావతి, తహసీల్దార్ కె.రమాదేవి, ఎంపీడీవో కొంకి అప్పారావు, పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ డీఈఈ ఎం.ప్రమీళ, ఏఈఈ ఎ.అప్పారావు, పంచాయతీ కార్యదర్శి మూర్తిబాబు, క్లస్టర్ ఇన్‌చార్జి పుప్పాల రమేశ్ పాల్గొన్నారు.

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో టీడీపీ కార్యకర్త దుర్మరణం

కొయ్యూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లుబ్బుర్తి-నడింపాలెం మధ్య గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మాల మాకవరం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త కొర్రు ప్రకాశరావు(60) దుర్మరణం చెందాడు. గురువారం రాత్రి చింతలపూడిలో జరిగే శుభకార్యానికి వెళ్లిన ప్రకాశరావు తిరిగి మాకవరం ద్విచక్ర వాహనంపై వస్తుండగా నడింపాలెం సమీపంలోని వంతెన వద్ద అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయాలై పడిపోయాడు. అదే శుభకార్యానికి వెళ్లి వస్తున్న వారు ప్రమాద ఘటనను గుర్తించి కుటుంబీకులకు సమాచారమందించారు. దీంతో వారు వచ్చి చూడగా అప్పటికే ప్రకాశరావు మృతి చెందాడు. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ కిశోర్‌వర్మ తెలిపారు.

బ్రేకులు ఫెయిలై రోడ్డు పక్కకు దూసుకుపోయిన లారీ

లంకెలపాలెం, మే 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై లంకెలపాలెం వద్ద గురువారం రాత్రి పెద్ద ప్రమాదం తప్పింది. బొగ్గు లోడుతో వెళుతున్న లారీ బ్రేకులు ఫెయిల్ కావడంతో రోడ్డు పక్కనున్న గోతిలోకి దూసుకుపోయింది. ఇందుకు సంబంధించి వివరాలిలా వున్నాయి. గంగవరం పోర్టు నుంచి పెదగంట్యాడ మండలంలోని గల హిందూజా పవర్ ప్లాంట్‌కు బొగ్గు లోడుతో లారీ వెళుతున్నది. లంకెలపాలెం సమీపంలోని పీబీఎల్ కంపెనీ వద్దకు వచ్చే సరికి బ్రేకులు ఫెయిలయ్యాయి. దీంతో అదుపు తప్పి రహదారి పక్కనే ఉన్న ఫెన్సింగ్‌పైకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. ప్రమాద సమయంలో వాహనాలు రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు చెబుతున్నారు.

లారీ డ్రైవర్‌కు ఆరు నెలల జైలు శిక్ష

నక్కపల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒడ్డిమెట్ట జంక్షన్ వద్ద ఎనిమిదేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతికి కారకుడైన లారీ డ్రైవర్‌కు ఆరు నెలలు జైలు శిక్ష, రూ.6 వేలు జరిమానా విధిస్తూ ఎలమంచిలి ఏజీఎఫ్‌సీఎం కోర్టు జడ్జి తీర్పు చెప్పినట్టు ఎస్‌ఐ సన్నిబాబు తెలిపారు. ఒడ్డిమెట్టకు చెందిన పైలా గిరిసాయి, అతనికి సోదరుడి వరుసైన పైలా వెంకట రమణ 2017 జూన్ 17వ తేదీన బైక్‌పై ఒడ్డిమెట్ట నుంచి ఎలమంచిలి వెళుతున్నారు. వెనుక నుంచి వేగంగా వస్తున్న లారీ, బైక్‌ను బలంగా ఢీకొనడంతో వెంకట రమణ అక్కడికక్కడే మృతిచెందాడు. గిరిసాయి తీవ్రంగా గాయపడ్డాడు. ఇతని తండ్రి కృష్ణంరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్‌ఐ సింహాచలం కేసు నమోదు చేసి, దర్యాప్తులో భాగంగా రాజమహేంద్రవరానికి చెందిన లారీ డ్రైవర్ రాలి అప్పారావును అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జీషీటు దాఖలు చేశారు. వాదోపవాదాల అనంతరం లారీ డ్రైవర్ అప్పారావు నిర్లక్ష్యంగా వాహనం నడిపి, ఒకరి మృతికి కారణమైనట్టు న్యాయమూర్తి నిర్ధారణకు వచ్చారు. ముద్దాయికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.6 వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

ఇసుక మాఫియా

... 5వ పేజీ తరువాయి

ఇసుక కోసం తవ్వకాలు జరుపుతున్నారు. వీరికి స్థానిక నేతలు 'సహకారం' అందిస్తున్నారు. నదుల్లో ఇసుక నిక్షేపాలు అధికంగా వున్నచోట అధికారంలో వున్న పార్టీలకు చెందిన స్థానిక నేతలు వేలం పాటలు నిర్వహించి అక్రమ తవ్వకాలకు అనధికారికంగా అనుమతులు ఇచ్చేస్తున్నారు. దీంతో రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులు దాడులు నిర్వహించి, కేసులు నమోదు చేయడానికి సాహసించడంలేదు.

ఇసుక తవ్వకాలు ఎక్కడంటే..

శారదా నదిలో అనకాపల్లి మండలం తగరంపూడి, వెంకుపాలెం, సీతానగరం, దిబ్బపాలెం, మూలపేట, కె.కోటపాడు మండలం చౌడువాడ, చోడవరం మండలం గవరవరం, లక్కవరం, దేవరాపల్లి మండలం తామరబ్బ, తెనుగుపూడి, వేచలం, కలిగొట్ల, బోయిలకింతాడ, మునగపాక మండలం ఉమ్మలాడ వద్ద, వరహా నదిలో ఎలమంచిలి మండలం ఏటికొప్పాక, దార్లపూడి వద్ద ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. పెద్దేరు నదిలో మాడుగుల మండలం సాగరం, సత్యవరం, చోడవరం మండలం జుత్తాడ, గజపతినగరం, గౌరీపట్నం, బొడ్డేరు నదిలో చీడికాడ మండలం సిరిజాం, మంచాల గ్రామాల్లో తవ్వకాలు జరుగుతున్నాయి.

ప్రభుత్వ ఇసుక డిపోలు వెలవెల

అనకాపల్లి, నర్సీపట్నం, చోడవరం, మాడుగుల, పాయకరావుపేట, ఎలమంచలి నియోజకవర్గాల్లో ప్రభుత్వం ఇసుక డిపోలను ఏర్పాటు చేసింది. రాజమమహేంద్రవరం, శ్రీకాకుళం ప్రాంతాల నుంచి ఈ డిపోలకు ఇసుక సరఫరా అవుతుంది. ప్రభుత్వం టన్ను రూ.900కు విక్రయిస్తున్నది. అయితే నదుల్లో అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపడుతున్న వారు ఇందులో సగం ధరకే ఇసుక అమ్ముతుండడంతో భవన నిర్మాణదారులు వీరి వద్దనే కొనుగోలు చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ డిపోలు వెలవెలబోతున్నాయి. గతంలో విక్రయించిన ఇసుకలో ఇప్పుడు సగం కూడా అమ్ముడు పోవడంలేదని తెలిసింది.

సైబర్ మోసాలకు అడ్డా

... 5వ పేజీ తరువాయి

ప్రయత్నాన్ని విరమించుకున్నారు. తర్వాత అచ్యుతాపురం పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో భోగాపురం పరిధిలోని అపార్ట్‌మెంట్లలోని ఫ్లాట్ల యాజమానులతో మాట్లాడి, కాల్ సెంటర్ల నిర్వాహకులకు అద్దెకు ఇప్పించాడు. 25 ఫ్లాట్లకు నెలకు రూ.6 లక్షల చొప్పున అద్దె చెల్లించేలా ఒప్పందం చేసుకున్నారు. వాస్తవంగా ఇక్కడ 2 బీహెచ్‌కే ఫ్లాట్ అద్దె రూ.10 వేలకు అటుఇటుగా వుంటుంది. కానీ ఇంతకు రెట్టింపు అద్దె వస్తుండడంతో అపార్ట్‌మెంట్ ఫ్లాట్ల యజమానులు ముందూ వెనుకా ఆలోచించకుండా స్థానిక రాజకీయ నాయకుడు చెప్పాడన్న ఉద్దేశంతో అద్దెకు ఇచ్చేశారు. సెజ్‌లోని పరిశ్రమల్లో పలు రాష్ట్రాలకు చెందిన వారు ఉద్యోగులుగా, కార్మికులుగా పనిచేస్తున్నారు. దీంతో ఫ్లాట్లను అద్దెకు తీసుకున్న వారి గురించి యజమానులతోపాటు స్థానికులు కూడా అంతగా పట్టించుకోలేదు. కాగా పోలీసు నిఘా వర్గాలు మాత్రం ఏడాది నుంచి ఇక్కడ కాల్ సెంటర్లు నడుపుతూ సైబర్ నేరాలకు పాల్పడుతున్న ముఠాలను గుర్తించకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది. నిందితులను లోతుగా విచారిస్తే మరిన్ని వాస్తవాలు వెలుగుచూసే అవకాశం వుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

పెట్రోల్ బంకు పనులు బంద్

... 5వ పేజీ తరువాయి

ఉన్నతాధికారులు వచ్చి స్థల పరిశీలన చేశారు. పెట్రోల్ బంకు ఏర్పాటుకు స్థలం అన్ని విధాలా అనుకూలంగా వుందంటూ పనులు చేపట్టేందుకు నిర్ణయించారు. ఇది జరిగిన కొద్ది రోజులకే రాష్ట్రంలో ప్రభుత్వం మారి కూటమి అధికారంలోకి వచ్చింది. గత ఏడాది డిసెంబరులో పెట్రోల్ బంకు నిర్మాణానికి పనులు ప్రారంభించారు. నేను చదును చేసి చుట్టూ ప్రహరీ గోడ నిర్మించారు. పెట్రోల్, డీజిల్ నిల్వ చేసే ట్యాంకుల కోసం భారీ గోతులు తీసి, చుట్టూ గోడలు నిర్మించారు. అయితే కూటమి నాయకులు పెట్రోల్ బంకు ఏర్పాటుపై అభ్యంతరాలు వ్యక్తం చేసినట్టు తెలిసింది. చుట్టూ నివాస గృహాలు, హోటళ్లు, క్రీడా మైదానం, రావు గోపాలరావు కళాక్షేత్రం వున్నాయి. పెట్రోల్ బంకు వల్ల ఇబ్బందులు తలెత్తే అవకాశాలు ఉన్నాయని అందువల్ల నిర్మాణ పనులను నిలిపివేయించాలని ఈ ఏడాది జనవరిలో టీడీపీ సీనియర్ నాయకులు, స్థానిక ఎంపీ సీఎం రమేశ్‌ను కలిసి కోరినట్టు తెలిసింది. ఈ కారణంగానే పనులు ఆపేశారని సమాచారం. డీసీఎంఎస్ నూతన పాలకవర్గం ఏర్పడిన తరువాత పెట్రోల్ బంకు ఏర్పాటుపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం వుందని డీసీఎంఎస్ అధికారులు చెబుతున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	105.00
లైవ్ ధర	125.00
విత్ స్కిన్	220.00
స్కిన్ లెస్	230.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549